



# ప్రజాప్రశ్న

తెలుగు దినపత్రిక







సంపుటి: 5 సంచిక: 24, పేజీలు - 08

శనివారం, జూన్ 28, 2025 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati




'సెక్యులర్', 'సోషలిస్ట్'

## పదాలపై రగడ

- ఆర్ఎస్ఎస్‌పై జైరాం రమేశ్ ఫైర్

2లో..



పాకిస్థాన్‌లో

## ఘోర విషాదం

- నదిలో కొట్టుకుపోయిన 18 మంది కుటుంబ సభ్యులు

2లో..



## జన్మతః పౌరసత్వం వివాదం

2లో..



తిరుమల

## కల్తీ లడ్డూ కేసు

- సుప్రీంకోర్టుకు సిట్ నివేదిక

2లో..

# క్రమ"శిక్ష"ణ ఎక్కడ.?

## కాంగ్రెస్ లో క్రమశిక్షణ కమిటీయా.. అదొక బ్రహ్మ పదార్థమేగా.?



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రమంగా పార్టీపైన పట్టుబిగించే ప్రయత్నం చేస్తున్నారు. కాంగ్రెస్ కు ఎవరూ శత్రువులుండరు. ఆ పార్టీ నేతలే. ఇది ఇప్పుడు మొదలయింది కాదు. దేశంలో ఏ రాష్ట్రంలో అధికారంలో ఉన్నా లేకపోయినా పైకి పార్టీ లేచే కొద్దీ కిందకు లాగే వాళ్లు ఎక్కువ మంది ఉంటారు. అందుకే చాలా మంది చాలా రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులు ప్రత్యర్థి పార్టీల నేతల కంటే సొంత పార్టీ నేతలకే ఎక్కువ భయపడుతుంటారు. అందుకు కారణం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది తమ కారణంగానే నని భావించి తనకు సరైన ప్రాధాన్యత ఇవ్వాలని కోరుకుంటారు. ఎమ్మెల్యే టిక్కెట్ రాకపోతే ఎమ్మెల్సీని అడుగుతారు. అదిఇస్తే మంత్రి పదవి సంగతేంటని ప్రశ్నిస్తారు.

### అన్నీ గాంధీ భవన్ నుంచి డిమాండ్లే..

కుటుంబంలో ఒకరికి టిక్కెట్ ఇచ్చి మంత్రిపదవిని ఇచ్చినా మిగిలిన కుటుంబ సభ్యుల మాటేంటని నిలదీస్తారు. ఇక ఎప్పుడూ ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయని వారు, వారి వల్ల ఒక్క ఓటు కూడా కాంగ్రెస్ గుర్తుపై వేయించలేని వారు సయితం తమకు పదవులకు

2లో..

కుర్చీ కోసం ఆ కుటుంబం

# ఎంతకైనా తెగిస్తుంది

- జైశంకర్ తీవ్ర విమర్శలు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** దేశంలో అత్యయిక పరిస్థితి (ఎమర్జెన్సీ) విధించడానికి ఒకే ఒక కుటుంబం కారణమని, అధికారం కోసం ఆ పార్టీ ఎంతకైనా తెగిస్తుందని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కాంగ్రెస్‌పై తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఎమర్జెన్సీ విధించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా

2లో..

## వివేకా హంతకులను పట్టించింది టెక్నాలజీనే

- ఏఐ హ్యాకథాన్ లో సీఎం చంద్రబాబు




**అమరావతి (ప్రశ్న న్యూస్)** టెక్నాలజీ సాయంతో ఆంధ్రప్రదేశ్ ని నేర రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పోలీసులకు పిలుపినిచ్చారు. టెక్నాలజీతో దర్యాప్తు ఎలా చేయాలో వివేకా హత్య కేసే ఉదాహరణ అని చంద్రబాబు చెప్పారు. గుంటూరు ఆర్వీఆర్ అండ్ జేసీ కాలేజీలో నిర్వహించిన

2లో..

కాంగ్రెస్ చేతకానితనంతో జూరాల,

# మంజీరా బ్యారేజిలకు ప్రమాదం

- కేటీఆర్ తీవ్ర విమర్శలు

- మంజీరా బ్యారేజీని ప్రభుత్వం ప్రమాదంలోకి నెట్టిందన్న కేటీఆర్
- మేడిగడ్డపై యాగీ.. మంజీరాపై మౌనమా? అని ప్రశ్న
- కక్ష సాధింపు మాని వెంటనే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** కాంగ్రెస్ సర్కారు చేతకానితనంతో జూరాల ప్రాజెక్టు ఘటన జరిగి ఒక్కరోజు కూడా గడవకముందే, ఇప్పుడు హైదరాబాద్ జంట నగరాల దాహార్తిని తీర్చే మంజీరా బ్యారేజీని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రమాదంలోకి నెట్టిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సాగు, తాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ, పర్యవేక్షణలో సీఎం రేవంత్ ఘోర వైఫల్యం వల్లే వరుసగా నిన్న జూరాల ప్రాజెక్టుకు,

2లో..

గేమ్ చేంజర్ కాబట్టే పర్యాటక

# ప్రాజెక్టులకు పారిశ్రామిక హోదా

- ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్న సీఎం చంద్రబాబు
- వెల్‌నెస్, హ్యాపీనెస్ డెస్టినేషన్‌గా ఏపీని అభివృద్ధి చేస్తామని స్పష్టీకరణ
- రాష్ట్ర పర్యాటక సలహాదారుగా యోగా గురు బాబా రామ్‌దేవ్‌కు బాధ్యతలు
- పెట్టుబడిదారులకు గంటల్లోనే అనుమతులు, పరిశ్రమలకు ప్రోత్సాహకాల వెల్లువ
- నాలుగేళ్లలో హోటల్ గదుల సంఖ్యను 15 వేలకు పెంచడమే లక్ష్యం




**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ పర్యాటక చిత్రపటంలో అగ్రస్థానంలో నిలబెడతామని, గ్లోబల్ టూరిజం డెస్టినేషన్‌గా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ధీమా వ్యక్తం చేశారు. పర్యాటక రంగం రాష్ట్ర భవిష్యత్తుకు గేమ్ ఛేంజర్ వంటిదని, అందుకే ఈ రంగానికి పారిశ్రామిక హోదా కల్పించామని ఆయన స్పష్టం చేశారు. విజయవాడలోని మురళీ ఫార్చ్యూన్ హోటల్‌లో శుక్రవారం జరిగిన గ్లోబల్ ఫర్ సస్టైయినబుల్ ట్రాన్స్‌ఫర్మేషన్ (జీఎఫ్ఎస్‌టీ) టూరిజం కాన్‌క్లేవ్‌లో ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా

2లో..

# వైఎస్ జగన్‌కు ఊరట

- ఏపీ హైకోర్టు కీలక ఆదేశాలు
- అప్పటి వరకు చర్యలు తీసుకోవద్దు
- మరో ఐదుగురికి ఊరట దక్కింది



ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఏపీ హైకోర్టులో ఊరట దక్కింది. సింగయ్య మృతి కేసులో జగన్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై విచారణ జరిగింది. ఈ మేరకు పిటిషన్‌పై విచారణను మంగళవారానికి (జులై 1) వాయిదా వేసింది. అప్పటి వరకు తొందరపాటు చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశించింది. వైఎస్ జగన్‌తో పాటుగా వైవీ సుబ్బారెడ్డి, విడదల రజిని, పేర్ని నాని, కేఎన్నార్‌లపై కూడా వచ్చే మంగళవారం వరకు చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. సింగయ్య మృతి కేసులో తమపై పోలీసులు నమోదు చేసిన కేసును క్వాష్ చేయాలని జగన్‌తో పాటూ మిగిలిన వైఎస్సార్‌సీపీ నేతలు ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. మరోవైపు సింగయ్య మృతి కేసుకు సంబంధించి వైఎస్ జగన్ కారు (ఏపీ 40 డీహెచ్ 2349)ను రవాణా శాఖ

3లో..

# ఐఏఎంసీకి రూ.350 కోట్ల భూకేటాయింపు రద్దు

- రాయదుర్గంలో 3.5 ఎకరాల కేటాయింపుపై జారీచేసిన జీఓల కొట్టివేత
- ప్రజాప్రయోజన వ్యాజ్యాలపై విచారణ జరిపి తుది తీర్పు వెల్లడి
- నిబంధనలకు విరుద్ధంగా కేటాయింపులు జరిగాయన్న పిటిషనర్లు
- జనవరిలో వాదనలు ముగియగా, శుక్రవారం తీర్పు వెలువరించిన ధర్మాసనం

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ హైకోర్టు హైదరాబాద్‌లోని అంతర్జాతీయ ఆర్బిట్రేషన్ అండ్ మీడియేషన్ సెంటర్ (ఐఏఎంసీ)కు రాయిదుర్గంలో 3.5 ఎకరాల భూమి కేటాయింపును రద్దు చేసింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2021-2022లో హైదరాబాద్‌లోని రాయిదుర్గం (ఐటీ కారిడార్, ఐకియా పక్కన)లో 3.5 ఎకరాల భూమిని ఐఏఎంసీకు ఉచితంగా కేటాయించింది. ఈ భూమి సుమారు 350 కోట్ల రూపాయల విలువైనదిగా అంచనా వేశారు. 2022 మార్చి 12న, అప్పటి భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి. రమణ ఐఏఎంసీ శాశ్వత భవనానికి శంకుస్థాపన చేశారు. అప్పటి ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు ఈ సంస్థకు పూర్తి మద్దతు

3లో..



ఫోన్ ట్యాపింగ్ విచారణ

# ఏమైనా డైలీ సీరియలా?

- ఎంపీ రఘునందన్ రావు ఆగ్రహం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసుపై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. సిట్ దర్యాప్తు ఒక డైలీ సీరియల్‌లా సాగుతోందని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మధ్య లోపాయికారీ ఒప్పందం ఉందని ఆయన ఆరోపించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ దుబ్బాక ఉపఎన్నికతోనే ప్రారంభమైందని, తాను మొదటి బాధితుడినని తెలిపారు. “దుబ్బాక ఉపఎన్నిక సమయంలో నా ఫోన్ ట్యాపింగ్ జరిగిందని అప్పుడే డీజీపీకి ఫిర్యాదు చేశాను. కానీ ఇప్పటివరకు నా నుంచి వివరాలు

2లో..

సున్నం చెరువు నీటితో

# ఆరోగ్యానికి కన్నం

## - ప్రజలకు హైడ్రా హెచ్చరిక

- సున్నం చెరువులో అత్యధికంగా సీసం
- సాధారణ కంటే 12 రెట్లు అధికం - ఆ నీటిని వాడొద్దన్న హైడ్రా



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ మహానగరంలోని చెరువుల పునరుజ్జీవనం కోసం హైడ్రా కృషి చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలోని అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేశారు. తాజాగా చెరువుల్లోని నీటి నాణ్యత కోసం చేపట్టిన పరిశోధనల్లో దిగ్భ్రాంతికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. మొదటి దశలో భాగంగా మాదాపూర్‌లోని సున్నం చెరువుపై దృష్టి సారించిన హైడ్రా ఆ చెరువు నీటి నమూనాలను సేకరించి, కాలుష్య నియంత్రణ మండలి సహకారంతో పరీక్షించింది. ఆ ప్రాంతంలోని భూగర్భ జలాలు అత్యంత

3లో..

## తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

- జాప్యానికి కారణాలు తెలపాలని ఆదేశం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలోని మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో జరుగుతున్న జాప్యంపై హైకోర్టు తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. మున్సిపల్ పాలకవర్గాల పదవీకాలం ఈ ఏడాది జనవరి 26న ముగిసినప్పటికీ ఇప్పటివరకు ఎన్నికలు నిర్వహించకపోవడంపై

3లో..

# కాళ్లు పట్టుకున్నా కనికరించలేదు

- కోల్‌కతా గ్యాంగ్ రేప్ బాధితురాలి వాంగ్మూలం



**కోల్‌కతా (ప్రశ్న న్యూస్)** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న ఓ దారుణ ఘటన పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో వెలుగుచూసింది. ఓ 24 ఏళ్ల లా విద్యార్థినిపై, ఆమె చదువుతున్న కళాశాల ప్రాంగణంలోనే అత్యాచారం జరిగింది. పెళ్లి ప్రతిపాదనను తిరస్కరించిందన్న కక్షతో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) విద్యార్థి విభాగం నాయకుడు ఈ ఘాతుకానికి పాల్పడినట్లు బాధితురాలు

3లో..

ప్రజాప్రశ్న

హైదరాబాద్, శనివారం 28, జూన్ 2025

# 'సెక్యులర్', 'సోషలిస్ట్' పదాలపై రగడ

## - ఆర్ఎస్ఎస్‌పై జైరాం రమేశ్ ఫైర్

**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** భారత రాజ్యాంగంలోని 'లౌకిక వాద' (సెక్యులర్), 'సామ్యవాద' (సోషలిస్ట్) పదాలపై రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హొసబళె చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా పెద్ద దుమారాన్ని రేపాయి. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తీవ్రస్థాయిలో స్పందించారు. ఆర్ఎస్ఎస్ మొదటి నుంచీ రాజ్యాంగాన్ని వ్యతిరేకిస్తోందని, దాని రూపకర్తలపై దాడి చేస్తోందని ఆయన ఘాటుగా విమర్శించారు.ఎక్స్ వేదికగా జైరాం రమేశ్ తన అభిప్రాయాలను పంచుకున్నారు. "ఆర్ఎస్ఎస్ భారత రాజ్యాంగాన్ని ఎన్నడూ అంగీకరించలేదు. 1949 నవంబర్ 30 నుంచే డాక్టర్ అంబేద్కర్, నెహ్రూ వంటి రాజ్యాంగ నిర్మాతలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తోంది" అని ఆయన ఆరోపించారు. మనుస్మృతి స్ఫూర్తితో రాజ్యాంగం లేదన్నదే ఆర్ఎస్ఎస్ అసంతృప్తికి కారణమని ఆయన వ్యాఖ్యానించారు. ఆర్ఎస్ఎస్, బీజేపీలు పదేపదే కొత్త రాజ్యాంగం కావాలని పిలుపునిచ్చాయని, 2024 లోక్‌సభ ఎన్నికల్లోనూ ప్రధాని మోదీ ప్రచారంలో ఇదే నినాదాన్ని వినిపించారని, అయితే దేశ ప్రజలు ఆ పిలుపును గట్టిగా తిరస్కరించారని రమేశ్ గుర్తుచేశారు.అయినప్పటికీ రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చాలనే డిమాండ్లు ఆర్ఎస్ఎస్ వర్గాల నుంచి ఇంకా వస్తూనే ఉన్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గతేడాది నవంబర్‌లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును జైరాం రమేశ్ ప్రస్తావించారు. రాజ్యాంగ పీఠికలో 'లౌకిక', 'సోషలిస్ట్' పదాలను చేర్చిన 42వ సవరణను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసిందని గుర్తుచేశారు. "ఆర్ఎస్ఎస్ అగ్ర నాయకుడు ఇప్పుడు లేవనెత్తుతున్న అంశంపై భారత ప్రధాన న్యాయమూర్తే 2024 నవంబర్ 25న ఒక తీర్పు ఇచ్చారు. దయచేసి ఆ తీర్పును చదవమని ఆయనను కోరుతున్నాం" అని జైరాం రమేశ్ స్పష్టం చేశారు.పార్లమెంటుకు రాజ్యాంగాన్ని, దాని పీఠికను సవరించే అధికారం ఉందని సుప్రీంకోర్టు తన తీర్పులో స్పష్టం చేసిందని జైరాం రమేశ్ తెలిపారు. కేశవానంద భారతి, ఎస్ఆర్ బొమ్మై వంటి చారిత్రక కేసుల్లో లౌకికవాదం అనేది రాజ్యాంగం యొక్క మౌలిక లక్షణమని న్యాయస్థానం పలుమార్లు పునరుద్ఘాటించిందని ఆయన పేర్కొన్నారు.

### హొసబళె ఏమన్నారంటే...?

నాటి ఎమర్జెన్సీకి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జరిగిన ఒక కార్యక్రమంలో దత్తాత్రేయ హొసబళె మాట్లాడారు. రాజ్యాంగంలో 'సోషలిస్ట్', 'సెక్యులర్' అనే పదాలను బలవంతంగా చేర్చారని, వాటిపై ఇప్పుడు పునఃసమీక్ష జరగాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఎమర్జెన్సీ విధించి ప్రజాస్వామ్యాన్ని అణచివేసిన వారు ఇంతవరకు క్షమాపణ చెప్పలేదని కూడా ఆయన విమర్శించారు. హొసబళె వ్యాఖ్యలతో రాజ్యాంగ మౌలిక సూత్రాలపై ఆర్ఎస్ఎస్, కాంగ్రెస్ మధ్య మరోసారి సైద్ధాంతిక పోరు మొదలైంది.

# పాకిస్థాన్‌లో ఘోర విషాదం

## - నదిలో కొట్టుకుపోయిన 18 మంది కుటుంబ సభ్యులు

ఇస్లామాబాద్ (ప్రశ్న న్యూస్) పాకిస్థాన్‌లో విషాదకర సంఘటన చోటు చేసుకుంది. విహారయాత్రకు వెళ్లిన ఒకే కుటుంబంపై వరద రూపంలో మృత్యువు విరుచుకుపడింది. ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో సంభవించిన ఆకస్మిక వరదల్లో ఒకే కుటుంబానికి చెందిన 18 మంది గల్లంతయ్యారు. ఈ దుర్ఘటనలో ఇప్పటివరకు ఏడుగురి మృతదేహాలను వెలికితీసినట్లు అధికారులు తెలిపారు. సమాచారం ప్రకారం, ఒక కుటుంబానికి చెందిన 18 మంది సభ్యులు విహారయాత్ర కోసం స్వాత్ లోయకు వచ్చారు. వారు స్వాత్ నది వద్ద ఉన్న సమయంలో ఈ దుర్ఘటన సంభవించింది. ఎగువ ప్రాంతాల్లో గత కొద్ది రోజులుగా కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. దీనితో స్వాత్ నదికి ఒక్కసారిగా వరద నీరు భారీగా పోటెత్తింది. నది ఉగ్రరూపం దాల్చడంతో నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరిగి, ఆకస్మిక వరద సంభవించింది. దీంతో నదిలో ఉన్న ఆ కుటుంబ సభ్యులు వరద ఉద్ధృతికి నిలవలేక కొట్టుకుపోయారని అధికారులు భావిస్తున్నారు.

### కొనసాగుతున్న సహాయక చర్యలు

ఈ ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే రెస్క్యూ బృందాలు రంగంలోకి దిగాయి. మొత్తం 80 మంది సిబ్బందితో కూడిన ఐదు బృందాలు గల్లంతైన వారి కోసం తీవ్రంగా గాలిస్తున్నాయి. నది పరివాహక ప్రాంతంలోని ఐదు వేర్వేరు ప్రదేశాల్లో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయని అధికారులు వివరించారు. ఇప్పటివరకు ఏడు మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని, మిగిలిన వారి కోసం గాలింపు కొనసాగుతోందని వారు పేర్కొన్నారు. భారీ వర్షాల కారణంగా స్వాత్ జిల్లాలోని అనేక గ్రామాలు, పట్టణాలు నీట మునిగాయని, పదుల సంఖ్యలో ప్రజలు వరద నీటిలో చిక్కుకున్నారని అధికారులు తెలిపారు. వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే పనులు కూడా ఏకకాలంలో జరుగుతున్నాయని వారు వెల్లడించారు.

# జన్మతః పౌరసత్వం వివాదం

## - ట్రంప్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో భారీ ఊరట

న్యూయార్క్ (ప్రశ్న న్యూస్) అమెరికాలో జన్మతః పౌరసత్వంపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన ఆంక్షల విషయంలో ఆయన ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో తాత్కాలిక విజయం లభించింది. ట్రంప్ విధానంపై దేశవ్యాప్తంగా స్టే విధిస్తూ దిగువ కోర్టులు జారీ చేసిన ఉత్తర్వులను అత్యున్నత న్యాయస్థానం శుక్రవారం పక్కన పెట్టింది. కింది కోర్టులు తమ అధికార పరిధిని అతిక్రమించి ఇలాంటి ఆదేశాలు జారీ చేశాయని స్పష్టం చేసింది. 6-3 మెజారిటీతో వెలువరించిన ఈ తీర్పులో, దిగువ కోర్టుల స్టేలను కేవలం వ్యాజ్యం వేసిన వారికి మాత్రమే పరిమితం చేయాలని, దేశవ్యాప్తంగా వర్తింపజేయడం సరికాదని సుప్రీంకోర్టు పేర్కొంది. అయితే, వలసదారుల తల్లిదండ్రులకు పుట్టిన పిల్లలకు పౌరసత్వం నిరాకరించే ట్రంప్ విధానం రాజ్యాంగబద్ధమా కాదా అనే అసలు సమస్యపై మాత్రం కోర్టు ఎటువంటి నిర్ణయాన్నీ ప్రకటించలేదు. ఒకే జిల్లా జడ్జి దేశవ్యాప్తంగా ప్రభుత్వ విధానాలను నిలిపివేయలేరన్న ప్రభుత్వ వాదనతోనే కోర్టు ఏకీభవించింది.
అమెరికా పౌరులు కాని లేదా చట్టబద్ధమైన శాశ్వత నివాసం లేని తల్లిదండ్రులకు అమెరికాలో పుట్టిన పిల్లలకు పౌరసత్వం ఇవ్వడాన్ని నిరాకరిస్తూ ట్రంప్ కార్యనిర్వాహక ఉత్తర్వులు జారీ చేశారు. ఇది 14వ రాజ్యాంగ సవరణకు విరుద్ధమంటూ పలు రాష్ట్రాలు, వలసదారుల హక్కుల సంఘాలు కోర్టులను ఆశ్రయించాయి. దీంతో పలు ఫెడరల్ కోర్టులు ఈ విధానం అమలును దేశవ్యాప్తంగా నిలిపివేశాయి. ఈ స్టేలను సవాలు చేస్తూ ట్రంప్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో అత్యవసర అప్పీల్ దాఖలు చేసింది. ఒకే జడ్జి జాతీయ విధానాన్ని పూర్తిగా అడ్డుకోవడం సరికాదని వాదించింది. తాజా తీర్పుతో వలసదారుల హక్కుల కోసం పోరాడుతున్న వారికి ఎదురుదెబ్బ తగిలినట్లయింది.

# తిరుమల కల్తీ లడ్డూ కేసు

## - సుప్రీంకోర్టుకు సిట్ నివేదిక

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించి సిట్ తన విచారణ నివేదికను సర్వోన్నత న్యాయస్థానానికి సమర్పించింది. దర్యాప్తులో వెలుగుచూసిన కీలక అంశాలతో కూడిన ఈ నివేదికను రెండు రోజుల క్రితం సీల్డ్ కవర్‌లో సుప్రీంకోర్టుకు అందజేసింది. ఈ కేసు దర్యాప్తులో ఇప్పటివరకు సాధించిన పురోగతిని, నిందితులు వివిధ న్యాయస్థానాలలో దాఖలు చేసిన పిటిషన్ల వివరాలను సిట్ తన నివేదికలో సమగ్రంగా పొందుపరిచినట్లు తెలుస్తోంది.

కేసు విచారణ సజావుగా సాగకుండా నిందితులు సృష్టిస్తున్న అడ్డంకుల గురించి కూడా న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లినట్టు సమాచారం. దర్యాప్తు ప్రక్రియను అడ్డుకునేందుకు నిందితులు ప్రయత్నిస్తున్నారని సిట్ తన నివేదికలో పేర్కొన్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. అంతేకాకుండా, ఈ కేసులో మరిన్ని తీవ్రమైన ఆరోపణలను కూడా సిట్ తన నివేదికలో ప్రస్తావించినట్లు తెలుస్తోంది. నిందితులు సాక్షులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, వారిని బెదిరింపులకు పాల్పడుతున్నారని సిట్ పేర్కొన్నట్టు సమాచారం.

ఈ అంశాలను తీవ్రంగా పరిగణించిన దర్యాప్తు బృందం, వాటిని నివేదికలో పొందుపరిచి సుప్రీంకోర్టుకు తెలియజేసింది. సిట్ నివేదికతో ఈ కేసు విచారణ మరింత వేగవంతం అయ్యే అవకాశం ఉందని న్యాయ నిపుణులు భావిస్తున్నారు.

# సివిల్ మ్యాటర్‌లో ఎస్సై జోక్యం

# బాధితుడిని చితకబాదిన వైనం

**నల్లగొండ జిల్లా:** చండూరు ఎస్ఐ వెంకన్న ఓవర్ యాక్షన్ వివాదంగా మారింది. సివిల్ మ్యాటర్ లో జోక్యం చేసుకుని.. ఓ రైతును ఎస్ ఐ చితకబాదాడు. తాస్కానిగూడెం కు చెందిన అన్నదమ్ముల మధ్య భూ సమస్యను సీరియస్ గా తీసుకున్న ఎస్ఐ వెంకన్న, ఓ వర్గానికి మద్దతుగా.. మరో వర్గాన్ని వేధింపులకు గురిచేసారన్న ఆరోపణలు వచ్చాయి. ఎస్ఐ వెంకన్న పోలీస్ మార్క్ ట్రీట్మెంట్ కు బాధితుడు గాయాలతో ఆస్పత్రి పాలైయాడు. -సివిల్ మ్యాటర్ లో జోక్యం చేసుకుని వేధింపులకు గురిచేస్తున్న ఎస్ఐ పై చర్యలు తీసుకోవాలని బాధితుల డిమాండ్.

# క్రమ"శిక్ష"ణ ఎక్కడ.?

కావాలని కోరతారు. కోరడమే కాదు గాంధీభవన్ లో కూర్చుని మరీ డిమాండ్ చేస్తారు. ఏకంగా మీడియా సమావేశం పెట్టి సొంత పార్టీ పైన, ప్రభుత్వంపైన విమర్శలు చేయడానికి కూడా వెనుకాడరు. అయితే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో వైఎస్ పాదయాత్రతో కాంగ్రెస్ సుదీర్ఘకాలం తర్వాత అధికారంలోకి వచ్చినా ఆ విజయం తమవల్లనేనంటూ డప్పాలుకొట్టుకున్న వారు అనేక మంది. వైఎస్ రాజశేఖర్ రెడ్డికి కూడా అసంతృప్తుల బెడద 2004 ముందు నుంచి ఆయన మరణించేంత వరకూ తప్పలేదు.

### పార్టీపై దృష్టిపెట్టాలనకుంటున్నా..

ఇక రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటయి రెండేళ్లు కావస్తుండటంతో ఇప్పటి వరకూ పార్టీ విషయాలను పెద్దగా పట్టించుకోలేదు. ఆయన ఎక్కువగా పాలనపైనే ఫోకస్ పెట్టారు. మంత్రి వర్గ విస్తరణ కూడా పూర్తి కావడంతో పాటు స్థానికసంస్థల ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ కాంగ్రెస్ పార్టీని గాడిలో పెట్టాల్సిన అవసరం ఏర్పడింది. నియోజకవర్గ స్థాయి నేతలు కూడా మీసాలు మెలేస్తుండటం, సీనియర్ నేతలపైనా, మంత్రులపైనా విమర్శలు చేస్తుండటంతో రేవంత్ రెడ్డి పార్టీ అధినాయకత్వంతో మట్లాడి క్రమశిక్షణ కమిటిని నియమించుకున్నారు. క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ గా ఉన్న వారు సయితం తమ ఇలాకాలో సొంత పార్టీ నేతలను విమర్శలు చేయడం కొంత ఇబ్బందిగా మారింది. పీసీసీ అధ్యక్షుడి హోదాలో మహేష్ కుమార్ గౌడ్ చేస్తున్న హెచ్చరికలు పెద్దగా పనిచేయడంలేదు.

### నాడు జగ్గయ్యపేటలో వైఎస్..

కాంగ్రెస్ లో క్రమశిక్షణ కమిటీ అనేది ఒక బ్రహ్మపదార్థం. 1999లో ఒక ఇన్సిడెంట్ గురించి మాట్లాడుకుందాం. అప్పుడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి పీసీసీ ప్రెసిడెంట్. కృష్ణా జిల్లా పర్యటనకు రోడ్డు మార్గాన బయలుదేరి వచ్చారు. జగ్గయ్య పేట అడ్డరోడ్డువద్ద సామినేని ఉదయభాను అనుచరులు మరొక కాంగ్రెస్ నేతను చితక బాదారు. ఆ నేత వైఎస్ కారులో ఉన్నా సరే కారు అద్దాలు బద్దలు కొట్టి బయటకు లాగి కొట్టారు. వెంటనే నందిగామలోని వసంత నాగేశ్వరరావు ఇంట్లో మీడియా సమావేశం పెట్టిన వైఎస్ సామినేని ఉదయభానును ఆరేళ్ల పాటు పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. కానీ ఆరు నెలలకు తిరక్కముందే జరిగిన ఎన్నికల్లో ఉదయ భానుకు టిక్కెట్ వచ్చింది. 1999లో ఎమ్మెల్యేగా కాంగ్రెస్ నుంచి గెలిచారు.

### ఇప్పుడు మల్లురవి నేతృత్వంలో..

అట్లుంటది కాంగ్రెస్ పార్టీ యవ్వారం. ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా క్రమశిక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. తనకు బాగా సన్నిహితుడైన నాగర్ కర్నూలు ఎంపీ మల్లురవిని క్రమశిక్షణ సంఘం ఛైర్మన్ గా నియమించారు.ఈ కమిటీ బెదిరింపులకు కాంగ్రెస్ నేతలు తలొగ్గుతారా? తోకముడుస్తారా? అంటే నవ్వడం మినహా మరొక సమాధానం రాదు. కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ అంటే కోరలు లేని పాము వంటిదని కార్యకర్తల నుంచి నేతల వరకూ అందరికీ తెలుసు. అందుకే ఇప్పుడు ఏర్పడిన క్రమశిక్షణ కమిటీ పార్టీ నేతలపై చర్యలు తీసుకుంటారని భావించడం అత్యాశే అవుతుంది. కొండా మురళిపైనో, మరొకరిపైనో వేటు వేసే ధైర్యం కాదు..కాదు.. నిర్ణయం తీసుకునే హక్కు ఈ కమిటీకి లేదనే చెప్పాలి. అందుకే హస్తం పార్టీ అలా ఎప్పుడూ వెలిగిపోతుంది.

# కుర్చీ కోసం ఆ కుటుంబం ఎంతకైనా తెగిస్తుంది

ఢిల్లీలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల దేశ ప్రజల ప్రాథమిక హక్కులకు తీవ్ర విఘాతం కలిగిందని గుర్తుచేశారు.

### - కుర్చీ కాపాడుకోవడానికే

నాటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పెరిగిపోయిన అవినీతి, అధిక ద్రవ్యోల్బణం కారణంగా ప్రజాదరణ లేకుండా పోయిందని జైశంకర్ అన్నారు. ఈ పరిస్థితుల్లో తమ అధికారాన్ని, కుర్చీని కాపాడుకోవడం కోసమే కాంగ్రెస్ పార్టీ ఎమర్జెన్సీని అస్త్రంగా వాడుకుందని ఆయన ఆరోపించారు. "అంతర్గత భద్రతకు ముప్పు వాటిల్లిందనే కారణంతో 1975 జూన్ 25న నాటి రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ ఎమర్జెన్సీని ప్రకటించారు. కానీ అసలు కారణం అధికారాన్ని నిలబెట్టుకోవడమే" అని జైశంకర్ పేర్కొన్నారు. స్వేచ్ఛను ఎప్పుడూ తేలిగ్గా తీసుకోకూడదనే గుణపాఠాన్ని ఎమర్జెన్సీ మనకు నేర్పిందని ఆయన అభిప్రాయపడ్డారు.

### - రాజ్యాంగ విలువలు గాలికొదిలేశారు

ఎమర్జెన్సీ కాలంలో కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగ విలువలను పూర్తిగా పక్కనపెట్టిందని జైశంకర్ విమర్శించారు. పౌరుల ప్రాథమిక హక్కులను కాలరాసి, పత్రికా స్వేచ్ఛను అణచివేశారని అన్నారు. ఆ చీకటి రోజుల్లో దాదాపు లక్షన్నర మందిని ఎలాంటి విచారణ లేకుండా జైళ్లలో నిర్బంధించారని ఆయన తెలిపారు. అందుకే జూన్ 25వ తేదీని 'సంవిధాన్ హత్య దివస్'గా పాటిస్తున్నామని స్పష్టం చేశారు. "కొంతమంది నేతలు ఇప్పుడు రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని తిరుగుతున్నారు. కానీ వారి అసలు ఉద్దేశాలు రాజ్యాంగ స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధంగా ఉంటాయి" అని పరోక్షంగా విమర్శించారు. తాము చేసిన చారిత్రక తప్పులపై కాంగ్రెస్ నేతలు ఎన్నడూ విచారం వ్యక్తం చేయలేదని, తమ నిర్ణయాలు తప్పని అంగీకరించే ధైర్యం వారికి లేదని జైశంకర్ దుయ్యబట్టారు.?

# వివేకా హంతకులను పట్టించింది టెక్నాలజీనే

ఏఐ ఫర్ ఏపీ పోలీస్-హ్యాకథాన్-2025 కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. నేరాల కట్టడికి, వేగవంతమైన దర్యాప్తునకు పోలీస్ విభాగం టెక్నాలజీని వినియోగించుకునే అంశంపై ఈ హ్యాకథాన్ ఏర్పాటు చేసింది. ఏపీ పోలీస్ విభాగం, అమెరికాకు చెందిన 4 సైట్ ఏఐ సంస్థలు ఈ హ్యాకథాన్ నిర్వహించాయి. ఈ హ్యాకథాన్ లో 160కు పైగా టీములు పాల్గొన్నాయి. ఈ టీములతో సీఎం చంద్రబాబు కొద్ది సేపు ముచ్చటించారు. పోలీస్ విభాగంలో టెక్నాలజీని వినియోగించడం ద్వారా ఎలాంటి సేవలు అందించవచ్చు పనితీరును ఏ విధంగా మెరుగుపరుచుకోవచ్చనే అంశంపై వారితో ముఖ్యమంత్రి చర్చించారు.

### - వివేకా హత్య కేసు.. గూగుల్ టేకవుట్

హ్యాకథాన్ కార్యక్రమానికి హాజరైన సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో ప్రసంగించారు. "రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధికి కట్టుబడి ఉంది. శాంతి భద్రతలు కంట్రోల్లో ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. అందుకే ఉమ్మడి రాష్ట్రానికి సీఎంగా ఉన్నప్పుడు కూడా శాంతి భద్రతలకు ఎక్కువ ప్రాధాన్యతనిచ్చానని స్పష్టం చేశారు. దీనికి పోలీస్ శాఖ సమర్థవంతంగా పని చేయాలి. గతంలో మాదిరి కాకుండా పోలీసుల పనితీరు మారాలి. సహజంగా పోలీసులు పాత పద్ధతులను అవలంభిస్తారు. కానీ ఏపీ పోలీసులు టెక్నాలజీ అవసరాన్ని గుర్తించి ఈ రకమైన హ్యాకథాన్ ఏర్పాటు చేయడం సంతోషం. పోలీసులు తమ దర్యాప్తులో టెక్నాలజీని విరివిగా వినియోగించాలి. వివేకా హత్య కేసులో నాపై ఆరోపణలు చేశారు. నారాసుర రక్త చరిత్ర అంటూ విమర్శించారు. కానీ సీబీఐ తన దర్యాప్తులో గూగుల్ టేకవుట్ వంటి సాంకేతిక విధానాలను వినియోగించడం ద్వారా వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. ఇప్పటికీ వాళ్లు మారలేదు. మాజీ సీఎం అయ్యుండి తెనాలిలో రౌడీ షీటర్లకు సంఘీభావం తెలిపారు. ఇటీవల పల్నాడు జిల్లాలో పర్యటనలో ఏం జరిగిందో అందరూ చూశారు. తప్పులు చేసి బుకాయిస్తున్నారు. ఇలాంటి బుకాయింపులను తిప్పికొట్టాలంటే టెక్నాలజీని ఉపయోగించక తప్పదు" అని సీఎం స్పష్టం చేశారు.

### - తాటతీస్తాం!

ప్రభుత్వంలో టెక్నాలజీని వినియోగిస్తున్నామని పోలీస్ విభాగం కూడా సాంకేతిక అందిపుచ్చుకుంటోందని దానికి ఈ హ్యాకథాన్ నిర్వహణే నిదర్శనమన్నారు. "వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రభుత్వ సేవలు అందిస్తున్నాం. టెక్నాలజీ ద్వారా సేవలు అందించడమే కాదు, పాలనలో జవాబుదారీతనం పెరుగుతుంది. డ్రోన్లను సీసీ టీవీ కెమెరాలు అన్ని చోట్లా పెడుతున్నాం. రౌడీలు గొడవ చేస్తే ఆధారాలతో వారి చొక్కా పట్టుకునే పరిస్థితి తెస్తాం. ఇష్టానుసారంగా గంజాయి అమ్ముతాం, సేవిస్తాం, పండిస్తాం అంటే కుదరదు, తాటతీస్తాం. ఆడబిడ్డలను గొడవ చేస్తాం అత్యాచారాలను చేస్తాం అంటే కుదరదు. ఏఐ లేనప్పుడే కంట్రోల్ చేశాం, ఇప్పుడు టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది ఆధారాలు చాలా సులువుగా లభిస్తాయి. తప్పు చేస్తే ప్రభుత్వం ఏం చేయాలో అది చేసి చూపిస్తాం. యువత టెక్నాలజీతో లబ్ధి పొందాలి. గతంలో ఐటీని ప్రమోట్ చేశాం. ఇప్పుడు క్వాంటం వ్యాలీ ద్వారా తెలుగు సత్తాను చాటబోతున్నాం. అమెరికాలో సిలికాన్ వ్యాలీ, ఇక్కడ క్వాంటం వ్యాలీ. వర్క్ లోకల్లీ థింక్ గ్లోబల్లీ యాక్ట్ గ్లోబల్లీ అనే విధంగా ప్రస్తుతం ప్రపంచం రూపాంతరం చెందుతోంది" అని ముఖ్యమంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, హోం మంత్రి అనిత, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా పాల్గొన్నారు.

# గుజరాత్ జగన్నాథుడి రథయాత్ర సందర్భంగా వేడుకల్లో అపశృతి

**గుజరాత్** జగన్నాథుడి రథయాత్ర సందర్భంగా ఇవాళ పలు ప్రధాన నగరాల్లో జగన్నాథుడి రథయాత్రకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో గుజరాత్‌లో నిర్వహించిన ఈ వేడుకల్లో అపశృతి చోటు చేసుకుంది.గుజరాత్‌లోని గోల్‌వాడ వద్ద జగన్నాథుడి రథయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా రథయాత్ర కోసం తీసుకొచ్చిన ఓ ఏనుగు జనసమూహాన్ని చూసి బీభత్సం సృష్టించింది. అదుపుతప్పి జనంపైకి దూసుకెళ్లింది. దీంతో భక్తులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఏనుగు దాడి నుంచి తప్పించుకునేందుకు ఎక్కడివారు అక్కడ పరుగులు తీశారు. ఈ క్రమంలో అక్కడ తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ ఘటనలో పలువురు భక్తులు గాయపడ్డారు.

# కాంగ్రెస్ చేతకానితనంతో జూరాల, మంజీరా బ్యారేజిలకు ప్రమాదం

నేడు మంజీరా బ్యారేజీకి డేంజర్ బెల్స్ మోగుతున్నాయన్నారు. స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ (ఎస్డీఎస్ఓ) నిపుణుల బృందం గత మార్చి 22న బ్యారేజీని సందర్శించి సమర్పించిన నివేదికను ప్రభుత్వం నిర్లక్ష్యంగా పక్కనపెట్టడం క్షమించరాని నేరమని మండిపడ్డారు. మేడిగడ్డ బ్యారేజీ వద్ద కూడా చరిత్రలో లేనంత వరద రావడంతో రెండు పిల్లర్లకు పగుళ్లు వచ్చిన తరహాలోనే, ఇప్పుడు మంజీరాపై కూడా వరద ఒత్తిడి పెరిగి దిగువ భాగంలో పిల్లర్లకు పగుళ్లు వచ్చాయన్నారు. ఆప్రాన్ కొట్టుకుపోవడం, స్పెల్ వే లోని భాగాలు కూడా దెబ్బతిన్నట్టు ఎస్డీఎస్ఏ నివేదిక గుర్తించినా ముఖ్యమంత్రి మొద్దునిద్ర వీడకపోవడం మరో దుర్మార్గమని మండిపడ్డారు. నిన్నటిదాకా ఎన్డీఎస్ఏ నివేదిక చెప్పినా మేడిగడ్డ బ్యారేజీని రిపేర్ చేయకపోవడం, నేడు ఎస్డీఎస్ఓ నివేదిక అందినప్పటికీ మంజీరా బ్యారేజీ మరమ్మత్తులు చేపట్టకపోవడం..

ఈ కాంగ్రెస్ సర్కారు అలసత్వానికే కాదు.. దుర్మార్గపు వైఖరికి ప్రత్యక్ష నిదర్శనమని కేటీఆర్ విమర్శించారు. రానున్న రోజుల్లో పైనుంచి మంజీరాలో వరద ఉధృతి పెరిగితే మరింత కోతకు గురై చివరికి డ్యామ్ ను కూడా ప్రమాదంలోకి నెట్టే పరిస్థితి తలెత్తవచ్చని నిపుణులు అంచనా వేస్తున్న క్రమంలో ఇకనైనా ఈ చిల్లర రాజకీయాలు మాని అటు మేడిగడ్డ బ్యారేజీని, ఇటు మంజీరా బ్యారేజీని వెంటనే రిపేర్ చేయాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపై, కాంగ్రెస్ సర్కారుపై ఉందన్నారు.

బ్యారేజీల సామర్థ్యానికి మించిన వరద వచ్చిన సందర్భాల్లో ఆ ఒత్తిడిని తట్టుకోలేకే పిల్లర్లకు పగుళ్లు వచ్చినట్టు ఎస్డీఎస్ఓ గుర్తించింది. సరిగ్గా మేడిగడ్డ వద్ద కూడా ఊహించని వరద పోటెత్తడం వల్ల అక్కడ కూడా ఇదే తరహాలో పగుళ్లు ఏర్పడ్డాయి. కానీ దీన్ని అసెంబ్లీ ఎన్నికల వేళ భూతద్దంలో చూపించి అటు కాంగ్రెస్, ఇటు బీజేపీ కుమ్మక్కై బీఆర్ఎస్ పై బురదజల్లాయన్నారు. మేడిగడ్డ బ్యారేజీలోని రెండు పియర్స్ కు వచ్చిన పగుళ్లపై నానాయాగీ చేసిన కాంగ్రెస్-బీజేపీ నేతలు మంజీరా బ్యారేజీ పిల్లర్లకు వచ్చిన పగుళ్లపై కనీసం స్పందించకపోవడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు.

గత ప్రభుత్వాలు నిర్మించిన ప్రాజెక్టులు, బ్యారేజీల్లో స్వల్ప రిపేర్లు వస్తే, అప్పటికప్పుడు వాటిని మరమ్మత్తు చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారే తప్ప కాళేశ్వరంపై కక్షగట్టినట్టు ఏ ప్రభుత్వాలు గతంలో వ్యవహరించలేదు. పరిపాలన చేతకాక కేవలం రాజకీయ కక్షసాధింపులతో కాలం వెల్లదీస్తున్న ఈ ముఖ్యమంత్రి మంజీరా, మేడిగడ్డ వంటి తాగు సాగునీటి బ్యారేజీలను రిపేర్లు చేయకుండా వదిలేస్తే, సీఎం రేవంత్ ను, కాంగ్రెస్ సర్కారును చరిత్ర ఎప్పటికీ క్షమించదని హెచ్చరించారు.

# గేమ్ చేంజర్ కాబట్టే పర్యాటక ప్రాజెక్టులకు పారిశ్రామిక హోదా

పాల్గొని ప్రసంగించారు. వెల్‌నెస్, హ్యాపీనెస్ ఫ్యూచర్ డెస్టినేషన్‌గా ఏపీని తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

### - ఐటీని మించి ఉద్యోగాలు

భవిష్యత్తు మొత్తం పర్యాటక రంగానిదే అని, అన్ని 'ఇజం'ల కన్నా టూరిజమే గొప్పదని తాను దశాబ్దాల క్రితమే చెప్పిన మాట ఇప్పుడు నిజమవుతోందని చంద్రబాబు అన్నారు. "వ్యవసాయం, ఐటీ, తయారీ రంగాల కన్నా ఎక్కువగా ఉద్యోగాలు కల్పించే సత్తా ఒక్క పర్యాటక రంగానికే ఉంది. ఈ రంగం 20 శాతం వృద్ధి సాధించగలదు. పెట్టుబడులను ఆకర్షించేలా, ప్రజలకు ఆరోగ్యం, సంపద, ఆనందాన్ని పంచేలా 'హెల్తీ, వెల్తీ, హ్యాపీ' నినాదంతో ముందుకు వెళ్తున్నాం," అని ముఖ్యమంత్రి వివరించారు. రాష్ట్రంలో కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి ఆలయం, శ్రీశైలం సహా అనేక పుణ్యక్షేత్రాలు, వెయ్యి కిలోమీటర్ల సుదీర్ఘ తీరప్రాంతం, కోనసీమ అందాలు, హార్సిలీ హిల్స్ వంటివి ఏపీకి గొప్ప ఆకర్షణలని ఆయన పేర్కొన్నారు. అఖండ గోదావరి ప్రాజెక్టును కూడా చేపడుతున్నట్లు తెలిపారు.

### - పెట్టుబడులకు రెడ్ కార్పెట్

రాష్ట్రంలో పర్యాటక ప్రాజెక్టులకు అత్యంత వేగంగా అనుమతులు మంజూరు చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. "అనుమతుల కోసం ఒక్క గంట కూడా వృథా కానివ్వం. రియల్ టైంలో అనుమతులు ఇచ్చేందుకు 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానాన్ని అమలు చేస్తున్నాం. మా ప్రభుత్వంలో అవినీతికి తావులేదు, కేవలం పారదర్శకత, జవాబుదారీతనం మాత్రమే ఉంటాయి," అని ఆయన స్పష్టం చేశారు. పర్యాటక ప్రాజెక్టులకు విద్యుత్ సబ్సిడీలతో పాటు అనేక ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 3 వేల హోటల్ గదులు ఉండగా, రాబోయే నాలుగేళ్లలో ఈ సంఖ్యను 15 వేలకు పెంచడమే లక్ష్యమని ఆయన వెల్లడించారు. ఎంఎస్ఎంఈ ప్రాజెక్టులకు మరిన్ని ప్రోత్సాహకాలు ఇస్తామన్నారు.

### - టూరిజం సలహాదారుగా బాబా రామ్‌దేవ్

ఈ సందర్భంగా, రాష్ట్రంలో వెల్‌నెస్ టూరిజాన్ని ప్రోత్సహించేందుకు పర్యాటక సలహాదారుగా వ్యవహరించాలని బాబా రామ్‌దేవ్ ను చంద్రబాబు కోరారు. "యోగా ద్వారా ప్రజల్ని మీరు ఎలా ప్రభావితం చేశారో, అదే విధంగా ఏపీ పర్యాటక రంగానికి బ్రాండింగ్ చేసి పెట్టుబడులు తీసుకురావాలి" అని చంద్రబాబు పేర్కొన్నారు. మదనపల్లిలో ఏర్పాటు చేయబోయే వెల్‌నెస్ సెంటర్‌ను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దాలని కోరారు.

### - గత అనుభవంతో భవిష్యత్ ప్రణాళిక

మూడు దశాబ్దాల క్రితం తాను ఐటీ రంగాన్ని ప్రోత్సహించినప్పుడు ఎవరూ నమ్మలేదని, కానీ ఇప్పుడు దాని ఫలాలను తెలుగువారే ప్రపంచవ్యాప్తంగా అందుకుంటున్నారని చంద్రబాబు గుర్తుచేశారు. "అప్పుడు ప్రతి కుటుంబంలో ఒక ఐటీ నిపుణుడు ఉండాలని అన్నాను. ఇప్పుడు 'వన్ ఫ్యామిలీ, వన్ ఎంటర్‌ప్రెన్యూర్' అనే నినాదాన్ని ఇస్తున్నాను. ఈ లక్ష్యం కూడా త్వరలోనే నెరవేరుతుంది. ఏపీలో మీ పెట్టుబడి సురక్షితం. ఇదే సరైన సమయం, ఇప్పుడు కాకపోతే అవకాశం కోల్పోతారు" అంటూ పెట్టుబడిదారులకు పిలుపునిచ్చారు. త్వరలో అమరావతిలో క్వాంటం వ్యాలీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీని విస్తృతంగా అమలు చేస్తామన్నారు. ఆగస్టు 15 నాటికి ప్రభుత్వ పౌరసేవలన్నీ వాట్సాప్ ద్వారానే అందిస్తామని, ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదని ఆయన హామీ ఇచ్చారు.

# ఫోన్ ట్యాపింగ్ విచారణ ఏమైనా డైలీ సీరియలా?

తీసుకోలేదు. ఫిర్యాదు చేసిన నన్ను కాదని, సంబంధం లేని వ్యక్తులను సిట్ విచారణకు పిలుస్తోంది. మమ్మల్ని అడిగితే అన్ని ఆధారాలు ఇచ్చేవాళ్ళం కదా?" అని రఘునందన్ ప్రశ్నించారు. ఈ కేసు విచారణలో చివరికి గాడిద గుడ్డు తప్ప ఏమీ తేలదని ఆయన అన్నారు.

### - కాంగ్రెస్ పాలనపై తీవ్ర విమర్శలు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచార ఆర్భాటాలకే పరిమితమైందని రఘునందన్ రావు విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా పాలన సాగిస్తోందని మండిపడ్డారు. తనకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయని ఫిర్యాదు చేస్తే నియోజకవర్గానికి వెళ్ళినప్పుడు సమాచారం ఇస్తే భద్రత కల్పిస్తామని పోలీసులు చెప్పారని ఆయన తెలిపారు. పథకాల పేర్లు మార్చడంపై కూడా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలోని అన్నపూర్ణ క్యాంటీన్ల పేరును 'ఇందిరమ్మ'గా మార్చడం దౌర్భాగ్యమని అన్నారు. "ఇందిరమ్మ పేరు చెబితే ఎమర్జెన్సీ గుర్తుకు వస్తుందనే కనీస ఇంగితజ్ఞానం కూడా కాంగ్రెస్ నేతలకు లేదు. మేయర్ ఇప్పటికైనా పేర్లు మార్చడంపై కాకుండా నగరంలో కుక్కల బెడద వంటి సమస్యలపై దృష్టి పెట్టాలి" అని హితవు పలికారు. ఇందిరమ్మ ఇళ్ళు కూడా అర్హులైన పేదలకు కాకుండా కాంగ్రెస్ కార్యకర్తలకే దక్కాయని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గంలోనైనా అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ళు ఇచ్చారని నిరూపించాలని సవాల్ విసిరారు.

### - బీఆర్ఎస్‌పైనా విమర్శనాస్త్రాలు

ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేత కవితపై కూడా రఘునందన్ రావు స్పందించారు. "కవిత బీసీనా? పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు బీసీలు గుర్తుకు రాలేదా? పార్టీ అధ్యక్ష పదవి, శాసనసభాపక్ష నేత పదవి బీసీలకు ఇవ్వకుండా ఇప్పుడు బీసీ ఉద్యమం చేస్తామంటే ఎలా?" అని ప్రశ్నించారు. మతపరమైన రిజర్వేషన్లు తొలగిస్తే రాజ్యాంగ సవరణకు తాము సిద్ధంగా ఉన్నామని రఘునందన్ రావు స్పష్టం చేశారు.

# గుండె చెప్పే సూచనలు

## - ఈ లక్షణాలను అస్సలు నిర్లక్ష్యం చేయొద్దు

గుండె సమస్యల గురించి చాలామంది తీవ్రంగా ఆలోచించేది ఛాతీలో నొప్పి వచ్చినప్పుడు, లేదా రక్త పరీక్షల్లో భయపెట్టే రిపోర్టులు చూసినప్పుడు మాత్రమే. కానీ, గుండె ఆరోగ్యం దెబ్బతింటున్నప్పుడు ప్రమాద ఘంటికలు ఎప్పుడూ పెద్ద శబ్దంతో మోగవు. కొన్నిసార్లు చాలా చిన్న చిన్న లక్షణాల రూపంలో శరీరం మనల్ని హెచ్చరిస్తుంది. మనం వాటిని తేలిగ్గా తీసుకుని నిర్లక్ష్యం చేస్తుంటాం. అయితే, పెద్ద ప్రమాదం ముంచుకొచ్చే ముందే శరీరం పంపే ఈ బలహీనమైన సంకేతాలను అర్థం చేసుకోవడం చాలా అవసరం. అవేంటో వివరంగా చూద్దాం.

### - సాధారణ పనులకే అలసిపోతున్నారా?

కొన్ని మెట్లు ఎక్కినా, పార్కింగ్ స్థలంలో కాస్త దూరం నడిచినా విపరీతంగా అలసిపోయి, ఊపిరి తీసుకోవడానికి ఇబ్బంది పడుతున్నారా? ఇది సాధారణ నీరసం కాకపోవచ్చు. గుండె రక్తాన్ని సరిగ్గా పంప్ చేయలేనప్పుడు శరీరంలోని కండరాలకు, అవయవాలకు అవసరమైన ఆక్సిజన్ అందదు. దీనివల్ల తీవ్రమైన అలసట, నిస్సత్తువ ఆవరిస్తాయి. రోజువారీ పనులకు కూడా శక్తి లేనట్లు అనిపిస్తే, దాన్ని తేలిగ్గా తీసుకోకుండా వైద్యులను సంప్రదించడం మంచిది.

### - కాళ్లు, పాదాల్లో వాపులు

సాయంత్రం అయ్యేసరికి మీ పాదాలు లేదా చీలమండలాల్లో వాపు కనిపిస్తోందా? కేవలం ఉప్పు ఎక్కువగా తినడం వలనో, బూట్లు బిగుతుగా ఉండటం వలనో ఇలా జరుగుతోందని అనుకుంటే పొరపాటే. గుండె బలహీనపడి రక్తాన్ని సమర్థవంతంగా పంప్ చేయలేనప్పుడు, రక్తం వెనక్కి నెట్టబడి శరీర కణజాలాల్లోకి ద్రవాలు లీక్ అవుతాయి. గురుత్వాకర్షణ కారణంగా ఈ ప్రభావం మొదట కాళ్లు, పాదాల్లో కనిపిస్తుంది. సాక్సులు తీసినప్పుడు చర్మంపై లోతైన గుంతలు పడుతున్నా, వాపులు కనిపిస్తున్నా అది గుండె సమస్యకు సూచన కావచ్చు.

### - తరచూ కళ్లు తిరగడం, మైకం

అకస్మాత్తుగా నిలబడినప్పుడు కళ్లు తిరగడం సహజమే. కానీ, కూర్చున్నప్పుడు, నడుస్తున్నప్పుడు లేదా ఎప్పుడైనా సరే ఆకస్మికంగా మైకంగా అనిపిస్తే అది ప్రమాద సంకేతం. గుండె మెదడుకు సరిపడా రక్తాన్ని పంపలేకపోవడం దీనికి కారణం కావచ్చు. రక్తపోటులో హెచ్చుతగ్గులు, గుండె లయ తప్పడం (అరిథ్మియా) వంటి సమస్యలు కూడా దీనికి దారితీయవచ్చు. స్పృహ కోల్పోయినా, లేదా ఆ పరిస్థితి వరకు వెళ్లినా అస్సలు నిర్లక్ష్యం చేయకూడదు.

### - ఆయాసం.. శ్రమ లేకపోయినా సరే!

ఎలాంటి శ్రమ లేకపోయినా, విశ్రాంతిగా ఉన్నప్పుడు కూడా ఆయాసం వస్తోందా? ముఖ్యంగా పడుకున్నప్పుడు లేదా చిన్న చిన్న పనులు చేస్తున్నప్పుడు శ్వాస తీసుకోవడం కష్టంగా ఉంటే, అది గుండె వైఫల్యానికి (కంజెస్టివ్ హార్ట్ ఫెయిల్యూర్) సంకేతం కావచ్చు. శరీరానికి అవసరమైన ఆక్సిజన్‌ను అందించడానికి గుండె తీవ్రంగా శ్రమిస్తోందని చెప్పడానికి ఇదొక హెచ్చరిక.

### అజీర్తి, వికారం.. మహిళల్లో మరింత జాగ్రత్త

కొన్నిసార్లు గుండె సమస్యలు జీర్ణ సంబంధిత సమస్యల రూపంలో బయటపడతాయి. ముఖ్యంగా మహిళల్లో ఈ లక్షణాలు ఎక్కువగా కనిపిస్తాయి. తరచూ అజీర్తి, వికారం, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు వేధిస్తున్నా, యాంటాసిడ్లు



వాడినా తగ్గకపోతే అది గుండెకు రక్త ప్రసరణ తగ్గడానికి (ఆంజైనా) సంకేతం కావచ్చు. ప్రతి గుండెపోటు ఛాతీ నొప్పితోనే రాదు, కొన్నిసార్లు అది కడుపులో మొదలవుతుంది.

### - నిద్ర సమస్యలు, గుండె దడ

నిద్రకు, గుండె ఆరోగ్యానికి మధ్య బలమైన సంబంధం ఉంది. నిద్రలో గురక పెట్టడం, శ్వాస ఆగిపోయినట్లుగా అనిపించడం (స్లీప్ అప్నియా) గుండెపై తీవ్రమైన ఒత్తిడిని పెంచుతుంది. ఇది అధిక రక్తపోటు, ఏట్రియల్ ఫిబ్రిలేషన్, గుండె వైఫల్యానికి దారితీస్తుంది. అలాగే, ఎలాంటి కారణం లేకుండా గుండె వేగంగా కొట్టుకోవడం, లయ తప్పడం (దడ) వంటివి అరిథ్మియా లక్షణాలు కావచ్చు. ఇవి స్ట్రోక్, గుండె వైఫల్యం ప్రమాదాన్ని పెంచుతాయి.

# ఏపీ టూరిజం బ్రాండ్ అంబాసిడర్ గా బాబా రాందేవ్

- పర్యాటక శాఖకు సలహాదారుగా వ్యవహరించాలని బాబా రామ్‌దేవ్‌కు విజ్ఞప్తి
- రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని స్పష్టీకరణ
- ఆగస్టు 15 నాటికి ప్రభుత్వ సేవలన్నీ ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తెస్తామని హామీ




అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలోపర్యాటక రంగం అభివృద్ధి కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. సర్క్యూట్ ఎకానమీ ద్వారా రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని ప్రోత్సహించాలని భావిస్తోంది. అలాగేహోమ్‌స్టేలు వంటి వినూత్న విధానాల ద్వారాటూరిజం అభివృద్ధి చేసే పనిలో ఉంది. పర్యాటక ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించి సందర్శకులకు ఆకర్షించాలనే ఉద్దేశంతో ఎయిర్‌డ్రోమ్‌లు ఏర్పాటుచేసే ఆలోచన కూడా ఏపీ ప్రభుత్వం చేస్తోంది. తాజాగా ఏపీ టూరిజం కోసం బ్రాండ్ అంబాసిడర్ నియమించాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలోనే ఏపీ టూరిజం బ్రాండ్ అంబాసిడర్‌గా రామ్‌దేవ్ బాబా పేరు తెరపైకి వచ్చింది. ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా ఈ వ్యాఖ్యలు చేయటం విశేషం. విజయవాడలో శుక్రవారం టూరిజం కాంక్లేవ్ జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం చంద్రబాబు బాబా రామ్‌దేవ్ సమాజానికి ఎంతో సేవ చేస్తున్నారని కొనియాడారు. ఏపీ పర్యాటక శాఖకు సలహాదారుగా ఉండాలంటూ బాబా రామ్‌దేవ్‌ను చంద్రబాబు కోరారు. అలాగే ఏపీలో వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు బాబా రాందేవ్‌ను కోరారు. సీఎం చంద్రబాబు కోరిక నేపథ్యంలో ఏపీ టూరిజం బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండటానికి బాబా రామ్‌దేవ్ సంసిద్ధత వ్యక్తం చేశారు. ఏపీలో ఎన్నో సుందరమైన ప్రాంతాలు ఉన్నాయని అయితే ఉత్తర భారతీయులకు వీటిపై అవగాహన లేదన్నారు. ఏపీలోని పర్యాటక ప్రాంతాల గురించి ఉత్తర భారతదేశంలోని వారికి తెలియజేయాలని.. అలాగే పర్యాటక ప్రాంతాలలో ఆయుర్వేద, నేచురోపతి, యోగా వంటి అంశాలు అవసరమని అన్నారు. మరోవైపు అన్నమయ్య జిల్లాలోని హార్సిలీహిల్స్‌లో ఆధ్యాత్మిక, సాంస్కృతిక వెల్‌నెస్ కేంద్రాన్ని నిర్మించనున్నట్లు రాందేవ్ బాబా తెలిపారు.సీఎం చంద్రబాబు విజ్ఞప్తి మేరకు అంతర్జాతీయ ప్రమాణాలతో హార్సిలీహిల్స్‌లో వెల్‌నెస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే విజయనగరం జిల్లా కొత్తవలసలో మెసర్స్ పతంజలి ఆయుర్వేద్ లిమిటెడ్ పేరుతో రూ.500 కోట్లతో భారీ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఈ భూములను గురువారం ఆయన పరిశీలించిన సంగతి తెలిసిందే.

### - గవర్నమెంట్ ఎందుకు ఈ క్యారవాన్ బస్ టూరిజంపై దృష్టి పెడుతోంది అంటే..

- ఏపీ లాంటి రాష్ట్రాల్లో నిజమైన ప్రకృతి అందాలను వీక్షించాలి అంటే అడవులు, కొండలు, బీచ్ లు లాంటి ఏరియాల్లోకి వెళ్ళాలి. అలాంటి చోట్ల శాశ్వత టూరిజం ఏర్పాట్లు, హొటళ్లు రెడీ చేయడం వల్ల అక్కడ ప్రకృతి దెబ్బ తినే అవకాశం ఉంటుంది. అదే క్యారవాన్ ల తో ఆ ప్రాబ్లమ్ ఉండదు.
- కోవిడ్ తర్వాత ఎక్కువమంది పర్యాటకులు సేఫ్టీ, ఫిజికల్ డిస్టెన్స్ కు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. అలాంటి వారు ఫ్యామిలీ సమేతం గా వెళ్ళడానికి ఈ రకం బస్సులు చాలా బెటర్.
- స్థానిక ఉపాధి క్యారవాన్ బస్సులు ప్రయాణించే మార్గల్లో స్థానికులు లోకల్ ఫుడ్, హ్యాండీ క్రాఫ్ట్ లాంటివి అమ్మడం, క్యారవాన్ పార్కింగ్ ఏర్పాటు లాంటి అవకాశాలు తో ఉపాధి పొందే చాన్సెస్ ఉన్నాయి.
- అసలు ఎలాంటి ఇన్ఫ్రాస్ట్రక్చర్ లేని అరుదైన టూరిస్ట్ స్పాట్ లకు కూడా వీటిలో సేఫ్ గా వెళ్లి వచ్చేయొచ్చు.
- ఇప్పటికే ఇతర రాష్ట్రాల్లో రెడీ

ఈ క్యారవాన్ బస్సుల టూరిజాన్ని ఇప్పటికే కేరళ, మహారాష్ట్ర, హిమాచల్ ప్రదేశ్ లాంటి రాష్ట్రాలు ఎడాప్ట్ చేసుకున్నాయి. ఇప్పుడు వాటిలో ఏపీ కూడా చేరింది. విజయవాడ లో ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా ఈ క్యారవాన్ బస్సులను ప్రారంచించగా..

దీన్ని ఏపీ టూరిజం డెవలప్ మెంట్ లో గేమ్ చేంజింగ్ ఈవెంట్ గా ఏపీ టూరిజం మినిస్టర్ కందుల దుర్గేష్ అన్నారు. త్వరలోనే వీటి బుకింగ్, రేట్స్ లాంటి వివరాలపై స్పష్టత ఇవ్వనున్నారు.

# సున్నం చెరువు నీటితో ఆరోగ్యానికి కన్నం

ప్రమాదకర స్థాయిలో కలుషితమైనట్లు పరీక్షల్లో తేలింది. సున్నం చెరువు నీటిని నిత్యావసరాలకు కూడా వినియోగించవద్దని హైడ్రా నగరవాసులకు స్పష్టం చేసింది. ఈ నీటిలో సాధారణ స్థాయి కంటే 12 రెట్లు అధికంగా సీసం ఉన్నట్లు గుర్తించారు. సీసం అనేది మానవ ఆరోగ్యానికి అత్యంత హానికరం. దీని అధిక సాంద్రత మెదడు, కిడ్నీలు, నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా పిల్లల్లో మానసిక ఎదుగుదలపై ఇది శాశ్వత ప్రభావం చూపుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. చెరువు సమీపంలో నివసించే ప్రజలు తాగునీటితో పాటు ఇతర అవసరాలకు ఈ నీటిని వాడితే తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఎదుర్కొనే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలోనే ఆ నీటిని వాడొద్దని హైడ్రా హెచ్చరికలు జారీ చేసింది. సున్నం చెరువు కాలుష్యానికి ప్రధాన కారణాల్లో పరిశ్రమల వ్యర్థాలు, మురుగునీరు, నిర్మాణ వ్యర్థాలు కలిసిపోవడం, రసాయన పదార్థాల లీకేజీలు అయి ఉండవచ్చని హైడ్రా ప్రాథమికంగా అంచనా వేస్తోంది. సరైన మురుగునీటి శుద్ధి ప్లాంట్లు లేకపోవడం, పారిశ్రామిక వ్యర్థాలను చెరువులోకి విడుదల చేయడం వంటివి పరిస్థితిని మరింత దిగజార్చాయని అధికారులు చెబుతున్నారు. తాజా నీటి నాణ్యత పరీక్షలతో సున్నం చెరువు పునరుజ్జీవన ప్రక్రియకు మరింత ప్రాధాన్యత ఏర్పడింది. హైడ్రా, స్థానిక అధికారులు, కాలుష్య నియంత్రణ మండలి సహకారంతో ఈ చెరువును శుభ్రపరచడానికి, నీటి నాణ్యతను మెరుగుపరచడానికి సమగ్ర ప్రణాళికలను రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు. కాగా, హైదరాబాద్‌లోని ఇతర చెరువుల పరిస్థితి కూడా ఇలాగే ఉండవచ్చనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# వైఎస్ జగన్‌కు ఊరట

అధికారులు తనిఖీ చేశారు. ఈ మేరకు కారుకు సంబంధించి ఫిట్‌నెస్‌ను ఎంవీఐ గంగాధర ప్రసాద్ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ప్రస్తుతం వైఎస్ జగన్ కారు గుంటూరు జిల్లా పోలీసు కార్యాలయంలో ఉన్న సంగతి తెలిసిందే. ఈ నెల 24న పోలీసులు వైఎస్ జగన్ తాడేపల్లి నివాసం దగ్గరకు వెళ్లి ఈ కారును స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ మేరకు రవాణాశాఖ అధికారులు తనిఖీ చేశారు. ఈ నెల 18న వైఎస్ జగన్ పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గంలోని రెంటపాళ్ల పర్యటనకు వెళ్లారు. ఈ క్రమంలో గుంటూరు సమీపంలో కాన్వాయ్ వెళుతుండగా జగన్ కారు కిందపడి సింగయ్య అనే వ్యక్తి ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే ఈ ఘటనపై నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. వైఎస్ జగన్‌తో పాటు ఆయన కారు డ్రైవర్ రమణారెడ్డి, పీఏ నాగేశ్వర్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ నేతలు వైవీ సుబ్బారెడ్డి, పేర్ని నాని, విడదల రజనిని నిందితులుగా చేర్చారు. ఈ కేసును క్వాష్ చేయాలని హైకోర్టును ఆశ్రయించారు. సింగయ్య కేసు మాత్రమే కాదు జగన్‌పై మరో కేసు కూడా నమోదైంది. ఈ ఏడాది ఫిబ్రవరి 19న మిర్చి రైతుల పరామర్శ కోసం జగన్ మిర్చి యార్డుకు వెళ్లారు. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నా వైఎస్సార్‌సీపీ నేతలు అనుమతి లేకుండా వచ్చారు. అలాగే ప్రభుత్వ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో నడిచే యార్డులో జగన్ రాజకీయ ప్రసంగాలు చేశారు. ఈ క్రమంలో గుంటూరు మిర్చి యార్డు పర్యటనపై పోలీసులు కేసు నమోదు చేశారు, వైఎస్సార్సీపీ నేతలకు నల్లపాడు పోలీసులు నోటీసులు ఇచ్చారు. జగన్‌తో పాటు నేతలు అంబటి రాంబాబు, లేళ్ల అప్పిరెడ్డి, మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, కావటి మనోహర్‌నాయుడు తదితరులపై కేసు నమోదైంది.

# కాళ్లు పట్టుకున్నా కనికరించలేదు

ఆరోపించింది. ఈ కేసుకు సంబంధించి ప్రధాన నిందితుడితో పాటు మరో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన బెంగాల్‌లో రాజకీయ దుమారానికి దారితీసింది.

### - ఫిర్యాదులో బాధితురాలి ఆవేదన

బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం, సౌత్ కలకత్తా లా కాలేజీ మాజీ విద్యార్థి, టీఎంసీ విద్యార్థి విభాగం (టీఎంసీపీ) జనరల్ సెక్రటరీ అయిన మనోజిత్ మిశ్రా (31) తనను పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేశాడు. తనకు అప్పటికే బాయ్‌ఫ్రెండ్ ఉన్నాడని, పెళ్లి చేసుకోలేనని ఆమె స్పష్టం చేసింది. దీంతో ఆగ్రహానికి గురైన మనోజిత్, ఆమె బాయ్‌ఫ్రెండ్‌కు హాని చేస్తానని, ఆమె తల్లిదండ్రులను తప్పుడు కేసుల్లో ఇరికిస్తానని బెదిరించినట్లు బాధితురాలు తెలిపింది. జూన్ 25వ తేదీన పరీక్ష ఫారాలు నింపడానికి కళాశాలకు వచ్చిన తనను, నిందితులు క్యాంపస్‌లోనే బంధించారని ఆమె పేర్కొంది. “నన్ను వదిలేయమని కాళ్లపై పడి వేడుకున్నా కనికరించలేదు. నన్ను బలవంతంగా సెక్యూరిటీ గార్డు గదిలోకి లాక్కెళ్లి బట్టలు విప్పేసి అత్యాచారం చేశాడు. ఇద్దరు వ్యక్తులు చూస్తుండ అతడు నాపై అత్యాచారానికి పాల్పడ్డాడు” అని వివరించింది. ఈ దారుణం జరుగుతున్నప్పుడు తనకు ఊపిరాడక ఇబ్బంది పడ్డానని, ఇన్ హేలర్ కావాలని ప్రాధేయపడితే తీసుకువచ్చి ఇచ్చారని వెల్లడించింది. అయితే, ఆసుపత్రికి తీసుకెళ్లమని వేడుకున్నా వారు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేసింది.

### - వీడియో తీసి బ్లాక్‌మెయిల్

నిందితులు తనపై అత్యాచారం చేస్తున్నప్పుడు వీడియోలు తీశారని, ఈ విషయం ఎవరికైనా చెబితే వాటిని బయటపెడతామని బ్లాక్‌మెయిల్ చేశారని బాధితురాలు ఆరోపించింది. తాను అక్కడి నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నించగా, హాకీ స్టిక్‌తో కొట్టడానికి ప్రయత్నించారని పేర్కొంది. రాత్రి 7:30 గంటల నుంచి 10:50 గంటల వరకు ఈ నరకం అనుభవించానని, చివరకు తీవ్రమైన హెచ్చరికలతో తనను బయటకు పంపారని తెలిపింది. “నేను ఒక లా విద్యార్థినిని. ఇప్పుడు నేనే బాధితురాలిగా మారాను. నాకు న్యాయం జరగాలి” అని ఆమె డిమాండ్ చేసింది.

### - ముగ్గురు నిందితుల అరెస్ట్

బాధితురాలి ఫిర్యాదు మేరకు కస్బా పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు, ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. ప్రధాన నిందితుడు మనోజిత్ మిశ్రాతో పాటు, అదే కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న జైబ్ అహ్మద్ (19), మరో విద్యార్థి ప్రమిత్ ముఖర్జీ (20)లను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని, వారిని ఐదు రోజుల పోలీస్ కస్టడీకి తరలించారు.

### రాజకీయ దుమారం

ఈ ఘటన బెంగాల్ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపింది. ప్రధాన నిందితుడు మనోజిత్ మిశ్రాకు టీఎంసీ అగ్రనేతలతో సంబంధాలు ఉన్నాయని ఆరోపిస్తూ బీజేపీ నేతలు సోషల్ మీడియాలో ఫోటోలను విడుదల చేశారు. అధికార టీఎంసీ నేరస్తులను కాపాడుతోందని బీజేపీ నాయకుడు అమిత్ మాలవ్య విమర్శించారు. అయితే, ఈ ఆరోపణలపై టీఎంసీ స్పందించింది. నిందితుడికి తమ పార్టీతో సంబంధం ఉన్న మాట వాస్తవమేనని, అయితే చట్టం నుంచి అతడిని ఎవరూ కాపాడలేరని, కఠిన శిక్ష పడేలా చూస్తామని స్పష్టం చేసింది. కళాశాల ప్రాంగణంలోనే విద్యార్థినికి భద్రత కరువవడంపై విద్యార్థి సంఘాలు, మహిళా సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి

# తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు నేడు విచారించింది. మున్సిపల్ ఎన్నికలను సకాలంలో ఎందుకు నిర్వహించడం లేదో కారణం తెలపాలని హైకోర్టు తన నోటీసుల్లో ప్రభుత్వాన్ని స్పష్టంగా కోరింది. తదుపరి విచారణను వచ్చే నెల 11న వాయిదా వేసింది. ఈ నోటీసులతో రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై మరింత పెరిగింది. సాధారణంగా, పాలకవర్గాల పదవీకాలం ముగియడానికి ముందే ఎన్నికల ప్రక్రియను ప్రారంభించి సకాలంలో పూర్తి చేయాల్సి ఉంటుంది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్నికల నిర్వహణలో నెలకొన్న జాప్యంపై హైకోర్టు సీరియస్‌గా ఉంది.

ఈ హైకోర్టు నోటీసుల తర్వాత తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందని చూడాలి మరి. కాగా, తెలంగాణలోని స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో జరుగుతున్న జాప్యంపై దాఖలైన పిటిషన్లపై ఇటీవల తెలంగాణ హైకోర్టు కీలక తీర్పును వెలువరించింది. జస్టిస్ టి. మాధవి దేవి నేతృత్వంలోని సింగిల్ జడ్జి బెంచ్ రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘంలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. సెప్టెంబర్ 30, 2025 నాటికి ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించింది. గ్రామ పంచాయతీల పాలకవర్గాల పదవీకాలం జనవరి 31, 2024న ముగిసింది. అప్పటి నుండి సుమారు 18 నెలలుగా ఎన్నికలు నిర్వహించకపోవడంపై మాజీ సర్పంచ్‌లు సహా పలువురు పిటిషనర్‌లు హైకోర్టును ఆశ్రయించారు.

ఎన్నికైన ప్రతినిధులకు బదులుగా ప్రత్యేక అధికారులను నియమించడం రాజ్యాంగ విరుద్ధమని పిటిషనర్‌లు వాదించారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లతో సహా వార్డుల విభజన, రిజర్వేషన్ల ప్రక్రియను 30 రోజులలోపు పూర్తి చేయాలని ఆదేశించింది. రాష్ట్ర ఎన్నికల సంఘం, ప్రభుత్వం నుంచి సమాచారం అందిన తర్వాత 60 రోజులలోపు గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసి, ఫలితాలను ప్రకటించాలని ఆదేశించింది. మొత్తంగా, ఎన్నికల ప్రక్రియను సెప్టెంబర్ 30 నాటికి పూర్తి చేయాలని హైకోర్టు గడువు విధించింది.

## బెల్ట్ షాపులు మూసివేయాలని

# మహిళల అందోళన

**కొమురంభీం ఆసిఫాబాద్** కాగజ్‌నగర్ ఎక్సైజ్ కార్యాలయం ఎదుట కాగజ్‌నగర్ మండలం చింతగూడ, కోయవాగు గ్రామానికి చెందిన మహిళలు ధర్నా చేసారు. గ్రామంలో ఎక్కడపడితే అక్కడ బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నాయని తమ పిల్లలు, భర్తలు గుడుంబా తాగి వచ్చి కొడుతున్నారని ఆరోపించారు. గ్రామంలో ఒక్క బెల్ట్ షాపు కూడా ఉండకుండా చూడాలని ఎక్సైజ్ సీఐ రవి కుమార్ కు వినతిపత్రం అందజేసారు.

## పెద్దపల్లి జిల్లాలో ఆర్‌ఓబి మరమ్మత్తు

# పనులతో నిలిచిపోయిన పలు రైళ్ళు

**పెద్దపల్లి** పెద్దపల్లిలోని కునారం రైల్వే బ్రిడ్జి పనుల మరమ్మత్తులతో బల్లార్షా, కాజీపేట రైల్వే జంక్షన్ల మధ్య రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. పెద్దపల్లి శివారులో నిర్మాణం చేపడుతున్న రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి ఉపయోగించే ఇనుప గార్డర్లు క్రాక్ ఇచ్చి బిడ్జి కొంత భాగం కిందికి వంగిపోయింది. రైల్వే పనులు నిర్వహిస్తున్న సిబ్బంది రైల్వే అధికారులకు సమాచారం ఇవ్వడంతో అధికారులు గంటపాటు విద్యుత్ సరఫరాను నిలిపి వేసి బ్రిడ్జి నిర్మాణ పనులకు అనుమతి ఇచ్చారు. కుంగిపోయిన భాగం ఎంతకు పైకి లేవకపోవడంతో గంటల తరబడి రైల్వే ట్రాక్ పై ట్రైన్లు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. పెద్దపల్లి సమీపంలోని రాఘవపూర్, కొలనూరు, ఓదెల, జమ్మికుంట మ, ఉప్పల్ రైల్వే స్టేషన్లలో పలు రైళ్ళు నిలిచిపోయాయి. భాగ్యనగర్, ఇంటర్సిటీ, సంపర్ క్రాంతి తదితర ట్రైన్లు ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో ప్రయాణికులు గంటల తరబడి రైళ్లలో అవస్థలు పడుతున్నారు.

## ఐఏఎంసీకి రూ.350 కోట్ల

# భూకేటాయింపు రద్దు

ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ భూమి కేటాయింపును సవాలు చేస్తూ 2023లో పిల్ దాఖలయ్యాయి. ఐఏఎంసీని అంతర్జాతీయ కంపెనీల మధ్య వివాదాలను పరిష్కరించే వేదికగా స్థాపించారు. వ్యాపార , సంస్థాగత ఆర్బిట్రేషన్‌ను ప్రోత్సహించడం దీని ఉద్దేశం. ఈ సెంటర్‌కు తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి , రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి ట్రస్టీలుగా ఉంటారు. రాష్ట్ర ప్ర భుత్వం ఐఏఎంసీ నిర్వహణ కోసం ఏటా 3 కోట్ల రూపాయల ఆర్థిక సహాయాన్ని కూడా కేటాయించింది. అడ్వకేట్ కె. రఘునాథ రావు , ఇతరులు ఈ భూమి కేటాయింపును సవాలు చేస్తూ రెండు పిల్ లు దాఖలు చేశారు. భూములు, ఆర్థిక సాయం చేయడంపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఐఏఎంసీని ఒక ప్రైవేట్ సంస్థగా పరిగణిస్తారని రాష్ట్ర ప్రభుత్వం ఐఏఎంసీకు ఆర్థిక సహాయం అందించడం మరియు ప్రభుత్వ శాఖలు, పబ్లిక్ సెక్టర్ సంస్థలకు ఐఏఎంసీని ఆర్బిట్రేషన్ వేదికగా ఉపయోగించాలని ఆదేశించడం కూడా చట్టవిరుద్ధమని వాదించారు.ద

అయితే అడ్వకేట్ జనరల్ ఎ. సుదర్శన్ రెడ్డి ఐఏఎంసీ స్థాపన అంతర్జాతీయ వ్యాపార వివాదాలను పరిష్కరించడానికి, హైదరాబాద్‌ను ఆర్బిట్రేషన్ హబ్‌గా మార్చడానికి అవసరమని వాదించారు. ఇరు పక్షాల వాదనలు విన్న తరవాత ఈ కేటాయింపు సుప్రీం కోర్టు తీర్పులను ఉల్లంఘించిందని, రాష్ట్రం ప్రైవేట్ సంస్థలకు ఉచిత భూమిని కేటాయించకూడదని హైకోర్టు నిర్ధారించింది. జస్టిస్ కె. లక్ష్మణ్, జస్టిస్ కె. సుజన బెంచ్ అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియా కార్యాలయం హైకోర్టులో 50 చదరపు అడుగుల స్థలంలో పనిచేస్తుందని గుర్తు చేసింది. ఈ తీర్పు ఐఏఎంసీ హైదరాబాద్‌లో శాశ్వత భవన నిర్మాణ ప్రణాళికలను ఆపేసినట్లు అవుతుంది.

# అర్హులందరికీ ఇండ్లు మంజూరు చేస్తాం

**ములుగు ప్రజల రుణం తీర్చుకుంటాం**

**అభివృద్ధి చేయడమే మా లక్ష్యం: మంత్రి ధనసరి అనసూయ సీతక్క**



ములుగు (ప్రశ్న న్యూస్) ములుగు నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటామని, అర్హులందరికీ కచ్చితంగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళాశిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు.శుక్రవారం ములుగు మండల కేంద్రం నుండి జీవింతరావు పల్లి గ్రామం మీదుగా గణేష్ పల్లి వరకు మూడు కోట్ల యాభై లక్షల రూపాయలతో ఏర్పాటు చేయనున్న రోడ్డు విస్తరణ పనులు, డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులను మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోతు రవిచంద్రలతో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని ఉద్దేశంతో మొదటి దఫాగా ప్రతి నియోజకవర్గానికి ఐదువేల ఇండ్లను కేటాయించి పనులు ప్రారంభించడం జరిగిందని, ములుగు నియోజకవర్గానికి సంబంధిత మంత్రి మరో వెయ్యి ఇండ్లను అదనంగా కేటాయించనున్నారని వివరించారు. ఎక్కడ అభివృద్ధి చెందని ప్రాంతాలను గుర్తించి దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని, ప్రతి గ్రామానికి రోడ్లు వేయడం, రోడ్లు విస్తరణ పనులు చేపట్టడం ముఖ్యమంత్రి ఆదేశాలతో జరుగుతున్నాయని తెలిపారు. తాము ఇచ్చిన హామీ మేరకు ములుగును మున్సిపాలిటీగా, మల్లంపల్లి గ్రామాన్ని జేడి మల్లంపల్లిగా మండలం గా ఏర్పాటు చేశామని అన్నారు. తాము అధికారికంగా ఆమోదం పొంది ఇచ్చిన హామీలను చూపిస్తున్నామని అన్నారు. తాను ఎంపీ బలరాం నాయక్ కలిసి ఈ ప్రాంత ప్రజల రుణం తీర్చుకుంటామని, జిల్లాను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి ప్రత్యేక నిధులను కేటాయించడం జరిగిందని అన్నారు. ఎంపీ బలరాం నాయక్ మాట్లాడుతూ తాను గతంలో కేంద్ర మంత్రిగా పనిచేసిన సమయంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని, నేడు మంత్రి సీతక్కతో కలిసి అన్ని అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంపత్, పంచాయతీరాజ్ ఈఈ అజయ్ కుమార్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నిరంతర అన్నదాన సేవా కార్యక్రమాలకు విశేష స్పందన

**- ట్రస్ట్ సేవా కార్యక్రమాలకు తోడ్పడే ప్రతి దాత దేవుడితో సమానం**

**- మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత 1526 రోజులుగా అన్నార్తులకు అన్నదానం**

**- ట్రస్ట్ నిర్వాహకులు : డాక్టర్ మధు మహేష్**





వేములవాడ,(ప్రశ్న న్యూస్)"అన్ని దానాల్లో కెల్లా అన్నదానం మిన్న" అన్న గొప్ప సందేశాన్ని స్ఫూర్తిగా తీసుకొని,వేములవాడ పట్టణానికి చెందిన "మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్"ఆధ్వర్యంలో గత 1526 రోజులుగా నిరంతరంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రజల అభినందనలు అందుకుంటోంది.ఈ పుణ్యకార్యంలో భాగంగా శుక్రవారం లక్ష్మీ గణపతి కాంప్లెక్స్, రాజన్న భీమేశ్వర ఆలయాల వద్ద పేదలకు, అవసరమైనవారికి అన్నదానం నిర్వహించబడింది.శుక్రవారం అన్నదాతలుగా రాపెల్లి రఘుపతి, రాపెల్లి వేణుగోపాల్-పుష్పలత దంపతులు, రాపెల్లి శ్రీధర్- లావణ్య దంపతులు, గోపు బాలరాజు, గోపు మల్లేశం కుటుంబ సభ్యులు పాలుపంచుకున్నారు.అలాగే శాశ్వత దాతలుగా జువ్వాడి వెంకటేశ్వరరావు-స్నేహలత, ప్రతాప్-స్వప్న సంపత్, నగుబోతు రవీందర్-జ్యోతి, గణాచారి మఠం శైలజ-సాంబశివు, దేవరాజు ఉమ-బాలచందర్ రాజు దంపతులు, రామడుగు శ్రీలత కుటుంబ సభ్యులు ప్రజ్ఞ-శరత్ చంద్ర, శిరీష-సాయిచంద్ర, శర్వాణి-రవిచంద్ర దంపతులు సహకారం అందించారు. హైదరాబాద్ వాసులైన చిన్నారులు శ్రీహర్ష, సాయికృష్ణ ఈ పుణ్య కార్యక్రమంలో తమ బంగారు హస్తం కలిపారు.ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ మధు మహేష్ మాట్లాడుతూ,"ఒకపూట అన్నాన్ని ఆశించేవారికి దానిని అందించడం మన బాధ్యత. సేవ చేయాలనుకునే దాతలు ముందుకు రావాలని మనస్ఫూర్తిగా కోరుతున్నాం," అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వొడ్యాల వేణు, నాగుల చంద్రశేఖర్, పొలాస రాజేందర్, గొండ ప్రసాద్, పసుల శ్రీనివాస్, సగ్గు రాహుల్ పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్లకు ఎగనామం పెడితే ఊరుకునేది లేదు!"

**- బీసీ సాధికారిత సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు : పొలాస నరేందర్ హెచ్చరిక**

వేములవాడ,(ప్రశ్న న్యూస్) 1995లో బీసీ రిజర్వేషన్లతో గెలిచిన సర్పంచులకు కోర్టు ఆదేశాలతో 6 నెలలపాటు అధికారాలు అప్పగించని సంఘటనలు మరలా పునరావృతం కాకూడదని, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సమన్వయంతో వ్యవహరించి న్యాయబద్ధంగా రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తిచేయాలని బీసీ సాధికారిత సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు పొలాస నరేందర్ విజ్ఞప్తి చేశారు

.హైకోర్టు ఇటీవల ఇచ్చిన ఆదేశాల ప్రకారం పంచాయతీ ఎన్నికలను సెప్టెంబర్ 30 లోగా పూర్తిచేసి, రిజర్వేషన్లను 30 రోజుల్లో ఖరారు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై ముసాయిదా బిల్లులను 2025 మార్చి 17న అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదించి, గవర్నర్‌కు పంపినట్లు తెలిపారు."ఆ బిల్లులు గవర్నర్ ఆమోదం పొందాయా? కేంద్రానికి చేరాయా? అనే స్పష్టత ఇప్పటికీ లేదు. గవర్నర్ ఆమోదం లభించినట్లయితే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఆమోదం అవసరం అవుతుంది. కానీ హైకోర్టు ఆదేశించిన గడువు జూలై 24 లోపు రిజర్వేషన్ల ఖరారుకు అవకాశం తగ్గుతోంది. దీంతో బీసీ రిజర్వేషన్ల ఆమోదం సంక్షోభంగా మారే పరిస్థితి కనిపిస్తోంది," అని నరేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సమన్వయంతో చట్టబద్ధంగా, శాస్త్రీయంగా ముందడుగు వేయాలని, అవసరమైతే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు నిర్వహించి బీసీ బిల్లులు ఆమోదింప చేయాలని ఆయన హితవు పలికారు.

# రాజకీయ దురంధరుడు పాములపర్తి

సమకాలీన రాజకీయ పరిస్థితులను అవగాహన చేసుకొని తదనుగుణంగా సానుకూల వాతావరణం ఏర్పరచుకుని పరిపాలన సాగించిన వాడే సమర్ధుడైన నాయకుడు కాగలడు అనేది అర్థశాస్త్ర రచయిత అయిన కౌటిల్యుడిగా పేరున్న చాణక్యుని అభిప్రాయం. ఆ అభిప్రాయాన్ని పూర్తిగా ఆకళింపు చేసుకొని, తదనుగుణంగా నడుచుకొని బలం, బలగం లేకున్నా, దేశ రాజకీయాలపై చెరగని ముద్ర వేయ గలిగారు పి.వి. నరసింహారావు. దక్షిణ భారతావని నుండి ప్రధానమంత్రి పదవిని అధిష్టించిన తొలి నేతగా, ఒకే ఒక తెలుగువానిగా, నరసింహారావు కార్యదీక్షత, దార్శనికత ద్వారా ఖ్యాతి గడించారు. "పి.వి"గా లబ్ధ ప్రతిష్టులైన ఆయన బహు భాషావేత్త, రచయిత. స్నాతకోత్తర న్యాయశాస్త్ర కోవిదులు, "అపర చాణక్యుడిగా" పేరొందారు. ఆంధ్ర ప్రదేశ్ లోని వరంగల్ జిల్లా, నర్సంపేట మండలం లక్నేపల్లి గ్రామంలో 1921 జూన్ 28 న రుక్మాబాయి, సీతారామారావు దంపతులకు పి.వి జన్మించారు. వరంగల్లు జిల్లాలోనే ప్రాథమిక విద్య మొదలు పెట్టారు. తరువాత కరీంనగర్ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన పాములపర్తి రంగారావు, రుక్మిణమ్మలు ఆయనను దత్తత తీసుకోవడంతో అప్పటినుండీ పాములపర్తి వెంకట నరసింహారావు అయ్యారు.1938 లోనే హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెసు పార్టీలో చేరి నిజాము ప్రభుత్వ నిషేధాన్ని ధిక్కరిస్తూ "వందేమాతరం" గేయాన్ని పాడారు. తాను చదువుకుంటున్న ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఆయనను బహిష్కరించారు. దాంతో ఓ మిత్రుడి సాయంతో నాగపూరు విశ్వవిద్యాలయంలో చేరి నాగపూరులో ఆ మిత్రుని ఇంట్లోనే ఉంటూ, 1940 నుండి 1944 వరకు ఎల్.ఎల్.బి చదివారు. స్వామి రామానంద తీర్థ, బూర్గుల రామకృష్ణారావుల అనుయాయిగా స్వాతంత్ర్యోద్యమం లోను, హైదరాబాదు విముక్తి పోరాటంలోను పాల్గొన్నారు. 1957 లో శాసనసభ్యుడిగా రాజకీయ జీవితం ఆరంభించిన పివి, రాష్ట్ర మంత్రిగా, ముఖ్య మంత్రిగా కేంద్ర మంత్రిగా, చివరకు ప్రధానిగా తన మేధాశక్తితో, క్రమానుగతంగా ఉన్నత పదవులను, కైవసం చేసుకున్న రాజనీతిజ్ఞులు ఆయన. కాంగ్రెస్ హయాంలో, పూర్తి సంఖ్యాబలం లేని మైనారిటీ ప్రభుత్వాన్ని, తన చాకచక్యంతో చాణక్యనీతితో, పూర్తి కాలం నడిపించిన మేధావి. 1957 లో మంథని నుండి ఎమ్మెల్యేగా ఎన్నికై, వరుసగా నాలుగు సార్లు గెలిచారు. 1962 లో మొదటిసారి రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం పొంది, 62 నుండి 64 వరకు న్యాయ సమాచార మంత్రిగా, 64 నుండి 67 వరకు దేవాదాయ, న్యాయబీ 67 లో వైద్య ఆరోగ్య 68 నుండి 71 వరకు న్యాయ, సమాచార శాఖలను నిర్వహించారు. 77లో లోకసభకు ఎన్నికైనారు. జనవరి 1980 – జూలై 1984 కేంద్ర విదేశ వ్యవహారాల మంత్రిబీ జూలై 1984 – డిసెంబర్ 1984 ఽంద్ర హెూం శాఖమంత్రిబీ నవంబరు 1984 – ఫిబ్రవరి 1985 భారత ప్రణాళికా శాఖ మంత్రి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, జనవరి 1985 – సెప్టెంబరు 1985 కేంద్ర రక్షణ శాఖమంత్రి, సెప్టెంబరు 1985 – జూన్, 1988 కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రిబీ జూలై 1986 – ఫిబ్రవరి 1988 కేంద్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖమంత్రిబీ జూన్ 1988 – డిసెంబర్ 1989 విదేశ వ్యవహారాల శాఖ మంత్రిబీ 1991 మే 29 – 1996 కాంగ్రెసు పార్టీ అధ్యక్షునిగాబీ జూన్ 1991 %-% 1996 మే 10 వరకు ప్రధానమంత్రిగా పని చేశారు. 71 సెప్టెంబర్ నుండి 73 జనవరి వరకు ముఖ్యమంత్రిగా ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నారు. సీఎం పీఠం అధిష్టించగానే అసమ్మతి. ఈ విషయమై అధిష్ఠానంతో చర్చించేందుకు ఢిల్లీ – హైదరాబాదుల మధ్య తిరిగేందుకే ఆయనకు సమయం సరిపోయింది. పట్టణ భూ గరిష్ఠ చట్టాన్ని తెచ్చింది ఆయనే. ఆ తర్వాత ఆయన కార్యక్షేత్రం ఢిల్లీకి మారింది. ఏఐసిసి ప్రధాన కార్యదర్శిగా, మొదటిసారి హనుమకొండ నుండి లోకసభకు ఎన్నికైనారు. నంద్యాల ద్వారా ఉప ఎన్నికలలో, టిడిపి పోటీ లేకుండా ఐదు లక్షల పైచిలుకు మెజారిటీతో గెలుపొంది, గిన్నిస్ రికార్డు సృష్టించి, పదవ లోకసభలో అడుగిడి, పలు శాఖల మంత్రిగా విధులు నిర్వర్తించారు. రాజీవ్ హత్య కారణంగా 1991 లో సార్వత్రిక ఎన్నికలలో పోటీ చేయకుండానే, దేశ 10వ ప్రధాన మంత్రి పదవి చేపట్టారు. భారత ఆర్థిక సంస్కరణలకు బీజం వేసి కుంటుతున్న వ్యవస్థను, తిరిగి పట్టాలెక్కించిన ఘనత సొంతం చేసుకుని, "భారత ఆర్థిక సంస్కరణల పితామహుడిగా" పేరొందిన మేధావి. ఆర్థిక వ్యవస్థ పునరుజ్జీవనం కోసం చేపట్టిన సంస్కరణలు, రిజర్వు బ్యాంకు గవర్నర్ గా, ఆర్థిక శాస్త్రవేత్త గా ఉన్న మన్మోహన్ సింగ్ ను, ప్రత్యేకించి పిలిచి, దేశ ఆర్థిక మంత్రిని చేయడం ఆయనకే చెల్లింది. దేశాన్ని బంగారం తాకట్టు పెట్టాల్సిన స్థితి నుండి, సూపర్ పవర్ గా తేర్చి దిద్దడానికి పునాది వేశారు. ఆర్థిక సంస్కరణల ద్వారా మార్కెట్ సరళీకరణ ఆర్థిక విధానాన్ని రూపొందించారు. సంస్కరణల 1992 లో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ కంప్యూటర్ ఆధారిత వ్యాపార పద్ధతిని ప్రారంభించారు. పంజాబ్ తీవ్రవాదాన్ని అణచి వేసింది ఆయన ప్రభుత్వమే. కాశ్మీర్ తీవ్రవాదులు ప్రముఖులను అపహరించినప్పుడు, వారి డిమాండ్లను లెక్క పెట్టక బందీలను విడిపించిన ఘనత ఆయనదే. ఇజ్రాయెల్ తో దౌత్య సంబంధాలు, తీవ్రవాదానికి పాకిస్థాన్ ఇస్తున్న ప్రోత్సాహాన్ని బయటపెట్టి, ఆగ్నేయాసియా దేశాలతో సత్సంబంధాలు కలిగి ఉండడం, పివి ప్రభుత్వం సాధించిన విజయమే.1998లో వాజపేయి ప్రభుత్వం జరిపిన అణుపరీక్షల కార్యక్రమాన్ని మొదలు పెట్టింది పీవీ ప్రభుత్వమే. ఆయన కాలంలోనే బాంబు తయారయింది. ఈ విషయాన్ని స్వయంగా వాజపేయే ప్రకటించారు. రాష్ట్ర విద్యా మంత్రిగా రెసిడెన్షియల్ పాఠశాలల వ్యవస్థ, కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రిగా నవోదయ విద్యాలయాలకు రూపకర్త అయినారు. 1973లో సీఎంగా భూస్వామ్య వ్యవస్థ నిర్మూలనకు నడుం బిగించి, భూ గరిష్ఠ పరిమితి, పట్టణ పరిమితి చట్టాన్ని అమలు చేసిందీ పి.వి.నే. ప్రధానిగా ఆయన హయాంలో 1992 డిసెంబర్ 6 న అయోధ్యలో బాబరీ మసీదును కూలగొట్టిన సంఘటనలో పీవి వైఖరి వివాదాస్పదమైంది. ప్రధానిగా ఐదేళ్ళ పదవీకాలంలో అనేక అవినీతి ఆరోపణలను పివి ఎదుర్కొన్నారు. చివరి కేసులన్నీ వీగిపోయాయి. బహుభాషా పండితులు, 17 భాషలలో అలవోకగా మాట్లాడ గలిగిన మేధావి. 1940 లో తన సోదరులతో కలిసి కాకతీయ పత్రికలో ఎన్నో వ్యాసాలు రాశారు. 1948 నుండి 51 వరకు కాకతీయ పత్రిక "సంపాదకునిగా" పని చేశారు. కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ విరచిత వేయి పడగలను, "సహస్ర ఫణ్" పేరుతో, హిందీ అనువాదం చేసి జ్ఞానపీఠ అవార్డు పొందారు.

1968-74 మధ్య తెలుగు సాహిత్య అకాడమీ చైర్మన్ గా ఉన్నారు. ఆయన రచనల్లో ప్రఖ్యాతి చెందినది "ఇన్‌సైడర్" అనే ఆత్మకథ. లోపలి మనిషిగా ఇది తెలుగులోకి అనువాద మయింది. 1983 లో స్పానిష్ భాషలో ప్రసంగించి, అలీన దేశాల శిఖరాగ్ర సమావేశంలో, క్యూబా అధ్యక్షులు ఫిడేల్ ను అబ్బుర పరిచిన గొప్పతనం ఆయనది. నిరాడంబరుడు, తన పిల్లలను సైతం ప్రధాని కార్యాలయానికి దూరంగా ఉంచిన నిజాయతీ పరులు. చివరిదశలో కోర్టుల చుట్టూ తిరగడానికి సొంత ఆస్తులను అమ్ముకున్న వ్యక్తి. నిజాం వ్యతిరేక పోరాట యుద్ధ తంత్ర నిపుణునిగా చివరకు స్వతంత్ర్య సముపార్జన దినం నాడు, 1947 ఆగస్టు 15 న కూడా అటవీ క్షేత్రంలో పోరాట క్రమంలోనే ఉన్న పోరాట యోధుడు. 2004 డిసెంబర్ 23 న తుది శ్వాస వదిలా రాయన. పి.వి. స్మృత్యర్థం హైదరాబాదులో భారత దేశంలోనే అతిపెద్ద ఫ్లై ఓవర్ కు పి.వి. నరసింహారావు ఎక్స్‌ప్రెస్ వే అని పేరుపెట్టారు. శంషాబాద్ విమానాశ్రయం ప్రయాణీకులను దృష్టిలో ఉంచుకొని దీనిని నిర్మించి,19.10.2009 న ప్రారంభించారు.

పివికి భారత రత్న అవార్డు ఇవ్వాలని సీఎం కేసిఆర్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తునే ఉన్నారు. శత జయంతి ఉత్సవాలను ఏడాదిపాటు నిర్వహించాలని కేసిఆర్ నిర్ణయించి, సీనియర్ నేత కేశవరావు అధ్యక్షతన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి, అనురించడం ద్వారా కేసిఆర్, తెలుగు జాతి మహోన్నత వ్యక్తికి తగిన గౌరవం ఇవ్వడం ముదావహం.

# కార్పొరేట్ విషవలయంలో విద్య, వైద్యం

కేంద్ర-, రాష్ట్ర ప్రభుత్వాలు పలు రకాల విద్య -వైద్య సంస్థలను నిర్వహిస్తున్నాయి. వాటి నిర్వహణకు సరిపడా నిధులు మాత్రం కేటాయించడం లేదు. అనేక రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయి. భారతదేశంలో పథకాలకు కొదువ లేదు, పైసలకు కొరత లేదు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా పథకాల పేర్లు మారుస్తున్నారు. ప్రధాన మంత్రులు, ముఖ్య మంత్రులు మారుతున్నారు. కాని ప్రజల జీవితాలు మాత్రం మారడం లేదు. స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు గడిచినప్పటికీ సగటు భారతీయుని ప్రాథమిక హక్కులైన కూడు-, గూడు-, గుడ్డతోపాటు విద్య-, వైద్యం-, ఆరోగ్యం సమకూర్చడంలో కేంద్ర-, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్దేశ పూరిత నిర్లక్ష్య వైఖరిని అనుసరిస్తున్నాయి. సమగ్ర విద్య వైద్య- ఆరోగ్య విధానాన్ని రూపొందించడంలోను, అమలు చేయడంలోను పూర్తిగా విఫలం చెందాయి. పూర్తి నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శిస్తున్నాయి. ఓట్లు దండుకోవడంలో, సీట్లు దక్కించుకోవడంలో కనబరిచిన శ్రద్ధాసక్తులలో పది శాతం కలిగి వున్నా 'అక్షర భారత్ ఆరోగ్య భారత్' నిర్మాణం జరిగి ఉండేది. దీని పర్యవసానమే విద్య -వైద్య రంగాలలో ప్రైవేటీకరణ,- కార్పొరేటీకరణ ప్రబలంగా పెరిగి పోయింది. విద్య వైద్య రంగంలో కార్పొరేట్ విషపోకడలు మొత్తం మానవాళి మనుగడకే ప్రమాదకరంగా పరిణమించాయి. సమస్యల సాలెగూళ్ళలో చిక్కి ప్రభుత్వ విద్య- వైద్య సంస్థలు ప్రజాదరణ కోల్పోతున్నాయి. కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్నామని చెపుతున్న ప్రభుత్వాలు విద్య- వైద్య సంస్థల్లో నేటికీ కనీస మౌలిక వసతులు కూడా కల్పించలేదు. కమిటీలు, కమిషన్లు వేస్తూ కడుపు నింపని సంక్షేమ పథకాలతో కాలయాపన చేస్తూ మీనమేషాలు లెక్కపెడుతున్నాయి. చిత్తశుద్ధి లోపించిన ప్రభుత్వాల పనితీరు ప్రజల పాలిటి శాపంగా మారింది. లక్షలాది మంది విద్యార్థినీ, విద్యార్థులు పోషక ఆహార లోపం, రక్తహీనత, కంటి, దంత, మూత్ర సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు. సమాజ మనుగడకు విద్య, -వైద్యం,- ఆరోగ్యం అతి ప్రధానమైనవి. ప్రజల ప్రాథమిక అవసరాలు తీర్చడం ప్రజాస్వామిక ప్రభుత్వాల ప్రధాన లక్షణం. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా గొప్పలు చెప్పుకుంటున్న భారత పాలక వర్గాలు ఆచరణలో దానికి భిన్నమైన వైఖరిని కలిగి వున్నాయి. భారత దేశంలో భూస్వాములు,- పెట్టుబడిదారులు ప్రైవేట్- కార్పొరేట్ శక్తులుగా ఎదిగి పాలక వర్గాలుగా అవతరించాయి. కేంద్ర-, రాష్ట్ర ప్రభుత్వాలు పాలక వర్గ ప్రయోజనాలే ప్రథమ కర్తవ్యంగా అంతర్గత ఎజెండాను అమలు చేస్తున్నాయి. ప్రభుత్వ అనుమతితోనే విద్య- వైద్య రంగాల్లో కార్పొరేటీకరణ విష ఫలాలనందించే వటవృక్షంగా పెరిగిపోయింది. కార్పొరేట్ యాజమాన్యాలు ప్రభుత్వ పాలక వర్గంలో కీలక భాగమై కూర్చున్నాయి. విధానాల రూపకల్పనలో, అమలులో చక్రం తిప్పుతున్నాయి. ఈ వర్గాలే సేవా రంగాలైన విద్య- వైద్య రంగాలను అత్యంత లాభసాటి వ్యాపారంగా మార్చాయి. ఈ వర్గాలే ప్రజలను కార్పొరేట్ రాజకీయాల వైపు మళ్లిస్తూ ఎన్నికల ప్రక్రియను, ప్రభుత్వాలను శాసిస్తున్నాయి. కార్పొరేట్ యాజమాన్యాలు విద్యార్థులను, ఉపాధ్యాయులను, డాక్టర్లను కీలుబొమ్మల్లాగా మార్చుకున్నాయి. ప్రైవేట్, కార్పొరేట్ విద్య- వైద్య సంస్థలమధ్య నెలకొన్న తీవ్రమైన అనారోగ్యకరమైన పోటీ కారణంగా స్వార్థం, అవినీతి అక్రమాలతో కూడిన తప్పుడు విధానాలకు పూనుకుంటున్నాయి. పారిశుధ్యం, తాగునీరు, మూత్ర శాలలు, భోజన శాలలు, వంట శాలలు, పక్కా భవనాలు, ప్రహరీ నిర్మాణాలు, మురుగు కాల్వలు, ఈగలు, దోమలు, శిథిలావస్థలో వున్న భవనాలు, విద్యుత్, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఫర్నీచర్, వైద్య పరికరాలు, మందులు తదితర మౌలిక వసతులు, సదుపాయాలు లేక ప్రభుత్వ విద్య- వైద్య సంస్థలు ఆదరణ కోల్పోతున్నాయి. వీటికి తోడు అరకొర నిధుల కేటాయింపు, సిబ్బంది కొరత, పర్యవేక్షణ లోపం, అవినీతి, నిర్లక్ష్యం తదితర ప్రధాన సమస్యలు ప్రభుత్వ విద్య- వైద్య సంస్థలను నిత్యం పట్టిపీడిస్తున్నాయి. సమస్యల వలయంలో చిక్కిన ప్రభుత్వ విద్య- వైద్య సంస్థలు ప్రజల విశ్వాసాన్ని, నమ్మకాన్ని కోల్పోయాయి. ఒకప్పుడు విదేశీయులు, దోపిడీ దొంగల బీభత్సంతో ప్రజలు అభద్రత భావంతో బతికేవారు. నేడు విద్య వైద్యం అందక జీవితంపై భయంతో, బెంగతో, అభద్రతా భావంతో జీవనం సాగిస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన 78 ఏండ్లుగా పాలక వర్గాల మోసపూరిత, కుట్ర బుద్ధితో విద్య-, వైద్య-, ఆరోగ్య, ఉపాధి అవకాశాలు సామాన్య ప్రజలకు అందకుండా పోయాయి. వలసలు, అప్పులు, ఆకలి చావులు, ఆత్మహత్యలు జరుగుతున్నాయి. ఆకలి చావులైనా, ఆత్మహత్యలైనా ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వ హత్యలుగానే పరిగణించాలి. నేడు దేశంలో జరుగుతున్న రైతు ఆత్మహత్యలు, కుల వృత్తిదారుల ఆత్మహత్యలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల మూలంగానే ఈ ఆత్మహత్యలు జరుగుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్వార్థపూరిత అనాలోచిత నిర్ణయాలు-, నిర్లక్ష్యాల మూలాలే నేటి ఆత్మహత్యలకు కారణాలు. ప్రజాద్రోహులు, పెట్టుబడిదారులు, కార్పొరేట్‌శక్తులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో మమేకమవుతున్నాయి.

ఇది చాలా ప్రమాదకరం. ప్రజలకు ఉపకరించే ప్రభుత్వ పథకాలను, లక్ష్యాలను నిర్వీర్యం చేస్తూ తమ వర్గ ప్రయోజనాలు కాపాడుకునే ప్రయత్నంలో భాగమే ఈ శక్తుల కలయిక. భారతదేశ ప్రజలు విజయానికి, విజయం తాలూకు ఫలాలను ఆస్వాదించడానికి మధ్య ఉన్న సంధికాలంలో ఉన్నారు. ప్రజల నోటి కాడి ముద్దను దళారులు గుంజుకునేందుకు ప్రభుత్వ విధానాలే దోహదం చేస్తున్నాయి. ప్రజాద్రోహులు, -రాజకీయ దళారులు ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేస్తున్నారు. విద్య-, వైద్యం-, ఉపాధి మొదలైన మౌలిక రంగాలలో విధానాలు రూపొందించడం,- అమలుపర్చడంలో ప్రజలు మరింత చైతన్యవంతమైన పోరాట స్ఫూర్తిని కలిగియుండాలి. విద్య వైద్య రంగాలలో కార్పొరేటీకరణ మానవజాతి మనుగడకే సమస్యగా తయారై ప్రజాజీవనానికి పెను సవాలుగా మారింది.

ప్రజలందరికీ సమానమైన, నాణ్యమైన విద్య వైద్యం అందాలంటే వీటిని జాతీయాకరణ చేయడమే ఏకైక పరిష్కారం. విద్య- వైద్యం జాతీయాకరణ జరిగేంతవరకు, దోపిడీ, పీడన ఆగేంతవరకు అలుపెరగని పోరాటం చేయడమే ప్రజల ముందున్న తక్షణ కర్తవ్యం.

# భాషలకు వారధిగా ఇంగ్లీషు

ఇంగ్లీష్ భాష ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రభావవంతమైన, విస్తృతంగా మాట్లాడే భాషలలో ఒకటి. ఇది కేవలం ఒక భాష కాదు, సాంస్కృతిక, ఆర్థిక, విద్య, సాంకేతిక రంగాలలో వంతెనగా పని చేస్తుంది. కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా ఇంగ్లీష్ మాట్లాడే వారిని అవమానకరంగా వ్యాఖ్యానించారు. ఇంగ్లీష్ భాష ప్రపంచంలోని వివిధ దేశాలు, సంస్కృతుల మధ్య సంభాషణకు సాధనంగా ఉంది. భారతదేశం వంటి బహుభాషా దేశంలో, హిందీ, తెలుగు, తమిళం వంటి భాషలతోపాటు ఇంగ్లీష్ ఒక సామాన్య భాషగా పనిచేస్తుంది. ఉదాహరణకు, ఒక తెలుగు వ్యక్తి, ఒక బెంగాలీ వ్యక్తితో ఇంగ్లీష్‌లో సులభంగా మాట్లాడగలడు. అంతర్జాతీయ సమావేశాలు, వాణిజ్య ఒప్పందాలు, దౌత్యసంబంధాలలో ఇంగ్లీష్ ఒక కీలక భాషగా ఉంది. ఐక్యరాజ్యసమితి వంటి సంస్థలలో ఇంగ్లీష్ అధికారిక భాషగా ఉపయోగించబడుతుంది. ఇంగ్లీష్ భాష విద్య, ఉద్యోగ రంగాలలో అపారమైన అవకాశాలను అందిస్తుంది. ప్రపంచంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాలు, గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి సాంకేతిక కంపెనీలు ఇంగ్లీష్‌ను ప్రధాన భాషగా ఉపయోగిస్తాయి. భారతదేశంలోని ఐఐటి, ఐఐఎం వంటి సంస్థలలో ఇంగ్లీష్‌లోనే బోధన జరుగుతుంది. ఉదాహరణకు, ఒక గ్రామీణ యువకుడు ఇంగ్లీష్ నేర్చుకొని సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా అమెరికాలో ఉద్యోగం సంపాదించవచ్చు. ఇంగ్లీష్ లేకపోతే అతని అవకాశాలు పరిమితమవుతాయి. ఇంగ్లీష్ ఇంటర్నెట్, సాంకేతికత రంగాలలో ఆధిపత్య భాష. వికీపీడియా, యూట్యూబ్, గూగుల్ వంటి ప్లాట్‌ఫారమ్‌లలో అత్యధిక సమాచారం ఇంగ్లీష్‌లో ఉంటుంది. భారతీయ విద్యార్థులు ఇంగ్లీష్ నేర్చుకోవడం వల్ల ఆన్‌లైన్ కోర్సులు, కోడింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి రంగాలలో ముందుకు వెళ్తున్నారు. ఉదాహరణకు, పైథాన్, జావా వంటి ప్రోగ్రామింగ్ భాషల డాక్యుమెంటేషన్ ఇంగ్లీష్‌లోనే ఉంటుంది. ఇంగ్లీష్ తెలియకపోతే, ఈ రంగాలలో రాణించడం కష్టం. ఇంగ్లీష్ భాష ద్వారా ప్రపంచ సాహిత్యం, సినిమాలు, సంగీతం భారతీయులకు అందుబాటులోకి వచ్చాయి. షేక్స్‌పియర్, జెకె రౌలింగ్ వంటి రచయితల రచనలు, హాలీవుడ్ సినిమాలు ఇంగ్లీష్‌లోనే ప్రపంచవ్యాప్తంగా ప్రజాదరణ పొందాయి. అదే విధంగా, భారతీయ రచయితలు అరుంధతీ రాయ్, సల్మాన్ రుష్డీ ఇంగ్లీష్‌లో రాసిన నవలలు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందాయి. ఇంగ్లీష్ లేకపోతే, ఈ సాంస్కృతిక వినిమయం సాధ్యపడేది కాదు. భారత దేశంలో ఇంగ్లీష్ ఒక అధికారిక భాషగా, న్యాయ వ్యవస్థ, పరిపాలనలో కీలక పాత్ర పోషిస్తుంది. సుప్రీం కోర్టు, పార్లమెంటు చర్చలలో ఇంగ్లీష్ వాడబడుతున్నది.ఇంగ్లీష్ మీడియం స్కూళ్లలో చదివిన విద్యార్థులు ఉన్నత విద్య, ఉద్యోగాలలో ముందుకు వెళ్తున్నారు. ఉదాహరణకు, బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాలలో ఐటి రంగంలో ఇంగ్లీష్ తప్పనిసరి. ఇంగ్లీష్ మాట్లాడగలిగే వ్యక్తులు సమాజంలో గౌరవం, ఆత్మవిశ్వాసం పొందుతారు. ఇంగ్లీష్ నేర్చుకోవడం వల్ల గ్రామీణ యువతకు నగరాలలో, అంతర్జాతీయ స్థాయిలో సమానంగా పోటీపడే అవకాశం లభిస్తుంది. ఉదాహరణకు, ఒక రైతు కుమారుడు ఇంగ్లీష్ నేర్చుకొని బిపిఒ ఉద్యోగంలో చేరి తన కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవచ్చు. చివరిగా%ొ% ఇంగ్లీష్ భాషను అవమానించడం కంటే, దాని ప్రాముఖ్యతను గుర్తించి, భారతీయ భాషలతో సమన్వయం చేస్తూ ప్రోత్సహించాలి. ఇంగ్లీష్ ఒక భాష కాదు, అది జ్ఞానం, అనేక అవకాశాలు ఇచ్చే జ్ఞాన భాండాగారం, ప్రపంచ సమైక్యతకు ద్వారం. హిందీ, తెలుగు, సంస్కృతం వంటి భాషలతో పాటు ఇంగ్లీష్‌ను కూడా నేర్చుకోవడం ద్వారా భారతీయ యువత ప్రపంచ స్థాయిలో రాణించగలరు. అమిత్ షా ఈ భాష గొప్పతనాన్ని అర్థం చేసుకొని, అన్ని భాషలను సమానంగా గౌరవించే విధంగా మాట్లాడాలని కోరుతున్నాం. నిజానికి భాష అవసరం భావ వ్యక్తీకరణకు తోడ్పడేదే. ఒక్కొక్క సారి మౌనం కూడా భాషే. మన మనోభావాలను (ఫీలింగ్స్)ను వ్యక్తం చేస్తుంది. అన్ని భాషలూ గొప్పవే. ఇందులో ఎక్కువ, తక్కువ అనే అభిప్రాయాలు అవసరం లేదు. లిపి లేని భాషలు కూడా వేల సంఖ్యలో భావం పంచుకోవటానికి ఉపయోగపడుతున్నాయి. ఏదిఏమైనా మన 'అమ్మ' భాష, మనం పెరిగిన పరిసరాల్లో వినిపించిన భాష, పాటశాలలో నేర్చుకున్న భాషలు మన విజ్ఞాన పరిధిలను విస్తరింపచేసేవే. ప్రతి భాషకు తనదైన ఒక ప్రత్యేక ఉంటుంది. ప్రతి భాషలో పదాలలో స్పష్టమైన ఉచ్ఛారణ ఆ భాషకు ప్రాణం. భాషలో ప్రాంతీయ 'యాస' ఆ భాషకు ఆభరణం. ఏ భాష 'యాస' ఆ భాషకు సహజ 'సౌందర్యాన్ని', 'సొగసును' ఆవిష్కరిస్తుంది. ఒక భాషలోని భావాలు సాహిత్యం ద్వారా వ్యక్తం అవుతుంది. ఈసారి సాహిత్యం ఇతర భాషల్లోకి అనువాదం చేయబడితే కొంత మేరకు 'ఒరిజినాల్టీ ' తగ్గినప్పటికీ ఆ భాషలో భావాలు ఇతరులకు తెలియవస్తుంది. ఏ భాష అయినా సరే రాణించాలీ అంటే భాషకు ధారణ, గౌరవం లభించాలి. ఆ భాషకు తగిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉండాలి. రాజ్యం ఆదరణ ఎంత ఉంటే అంతగా ఆ భాష రాణిస్తుంది.



## ఈ నీటిని ఖాళీ కడుపుతో
# తాగారంటే..
### గుట్టలాంటి పొట్ట సన్నజాజి తీగలా..!

ఉదయాన్నే ఖాళీ కడుపుతో నీళు తాగమని దాదాపు ప్రతి ఇంట్లో పెద్దవాళ్లు చెబుతుంటారు. ఇలా తాగడం వల్ల శరీర రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఖాళీ కడుపుతో నీళ్లు తాగితే కాలేయం, మూత్రపిండాలు, గుండె పూర్తిగా ఆరోగ్యంగా ఉంటాయి. కానీ నీళ్లలో కాసిన్ని బెండకాయ ముక్కలు వేసి నానబెట్టి తాగారంటే రెట్టింపు ప్రయోజనాలు పొందొచ్చు. నిద్ర లేచిన తర్వాత ఖాళీ కడుపుతో నీళు తాగమని దాదాపు ప్రతి ఇంట్లో పెద్దవాళ్లు చెబుతుంటారు. ఇలా తాగడం వల్ల శరీర రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఖాళీ కడుపుతో నీళ్లు తాగితే కాలేయం, మూత్రపిండాలు, గుండె పూర్తిగా ఆరోగ్యంగా ఉంటాయి. కానీ నీళ్లలో కాసిన్ని బెండకాయ ముక్కలు వేసి నానబెట్టి తాగారంటే రెట్టింపు ప్రయోజనాలు పొందొచ్చు. బెండకాయల్లో ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇందులో విటమిన్ కె, కాల్షియం కూడా పుష్కలంగా ఉంటాయి. అలాగే విటమిన్ సి, విటమిన్ ఎ కూడా పుష్కలంగా ఉంటాయి. మలబద్ధకంతో బాధపడేవారికి ఈ నీళ్లు మ్యాజిక్ టానిక్ మాదిరి పనిచేస్తుందని నిపుణులు అంటున్నారు. అంతే కాదు, రక్తంలో చక్కెర సమస్యలతో బాధపడేవారు బెండకాయ నీటిని క్రమం తప్పకుండా తాగాలి. ఈ నీళ్లు నొప్పిని తగ్గించడంలో సహాయపడుతుంది. ఆర్థరైటిస్‌తో బాధపడేవారికి ఇది గొప్ప ఫలితాలను ఇస్తుంది. కాలేయం ఆరోగ్యంగా ఉంటుంది. మూత్రపిండాలు త్వరగా నయం అవుతాయి. బరువు తగ్గాలనుకునే వారు దీన్ని ఖాళీ కడుపుతో క్రమం తప్పకుండా తీసుకుంటే, ఏడు రోజుల్లో బరువు తగ్గడం ఖాయం. బెండ బరువును తగ్గించడమే కాకుండా, చర్మాన్ని మెరిసేలా చేస్తుంది. ఇది చర్మం పొడిబారడాన్ని కూడా తొలగిస్తుంది. రాత్రిపూట ఒక గాజు సీసాలో నీటితో నింపి, అందులో తరిగిన బెండ ముక్కలు వేయాలి. దీన్ని రాత్రంతా నాననివ్వాలి. మరుసటి రోజు ఉదయం

## ఖాళీ కడుపుతో
# పండ్లు తినడం
## ఆరోగ్యానికి మంచిదా..?



పండ్లలో విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి.. ఇవి శరీరాన్ని వ్యాధుల నుండి రక్షించి ఆరోగ్యంగా ఉంచుతాయి. కానీ చాలా మంది మనస్సులలో ఈ ప్రశ్న తలెత్తుతుంటుంది.. ఖాళీ కడుపుతో పండ్లు తినడం సరైనదేనా..? తింటే ఏమవుతుంది.. ఉదయాన్నే పండ్లు తింటే ఏమైనా సమస్యలు వస్తాయా..? ఉదయం అనేది శరీరాన్ని శుభ్రపరచడానికి.. విషాన్ని తొలగించడానికి మంచి సమయం.. పండ్లు ప్రకృతి ప్రసాదించిన అత్యంత స్వచ్ఛమైన, పోషకమైన ఆహారం.. కొంతమంది ఉదయం ఖాళీ కడుపుతో పండ్లు తింటారు. అవి త్వరగా జీర్ణమవుతాయని.. ఖాళీ కడుపుతో తింటే, వాటి పోషకాలు కూడా శరీరానికి మంచి ప్రయోజనం చేకూరుస్తాయని నమ్ముతారు. దీనితో పాటు, పండ్లు శరీరానికి శక్తిని కూడా ఇస్తాయి.. ఇది రోజు ప్రారంభంలో మిమ్మల్ని తాజాగా ఉంచుతుంది. పండ్లలో అధిక మొత్తంలో ఫైబర్, నీరు ఉంటాయి, ఇవి కడుపు శుభ్రంగా, జీర్ణక్రియను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి. తలెతాళీ కడుపుతో పండ్లు ప్రయోజనకరంగా ఉంటాయా లేదా? అని కొంతమందికి ఈ ప్రశ్న తలెత్తుతుంటుంది.. దీనిగురించి ఢిల్లీలోని రాజీవ్ గాంధీ హాస్పిటల్‌లోని అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అజిత్ జైన్ పలు ఆసక్తికర విషయాలను చెప్పారు. ఖాళీ కడుపుతో పండ్లు తినడం శరీరానికి తాజాదనం, శక్తిని ఇవ్వడానికి ఉత్తమ మార్గం అని డాక్టర్ జైన్ అంటున్నారు. మీ జీర్ణ సామర్థ్యం ప్రకారం.. వాటిని ఎప్పుడు తినాలి అనే దాని ప్రకారం.. శరీరానికి ఏ పండ్లు ప్రయోజనకరంగా ఉంటాయో గుర్తుంచుకోవాలి.. సరైన సమయం – పద్ధతిని అవలంబించడం ద్వారా, మీరు పండ్ల నుంచి పూర్తి ప్రయోజనాలను పొందవచ్చు. మీ కడుపు చాలా సున్నితంగా ఉంది లేదా మీకు ఇరిటబుల్ బవెల్ సింద్రోమ్ఉంది. నారింజ లేదా నిమ్మకాయ వంటి కొన్ని సిట్రస్ పండ్లను ఖాళీ కడుపుతో తినడం వల్ల చికాకు కలుగుతుంది. అటువంటి పరిస్థితిలో, మీరు పండును వేరే ఆహారంతో కలిపి తినడం లేదా ఉదయం తేలికపాటి అల్పాహారం తిన్న తర్వాత పండు తీసుకోవడం మంచిది. ఖాళీ కడుపుతో ఏ పండ్లు తినాలి? బొప్పాయి: కడుపుని శుభ్రపరుస్తుంది, మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. ఆపిల్: ఫైబర్ –యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉండటం వలన రోగనిరోధక శక్తిని పెంచుతుంది. పుచ్చకాయ: హైడ్రేషన్ కు ఉత్తమమైనది, బరువు తగ్గడానికి సహాయపడుతుంది. జామ: జీర్ణవ్యవస్థను బలపరుస్తుంది బెర్రీలు: వృద్ధాప్యాన్ని తగ్గిస్తాయి. చర్మానికి ప్రయోజనకరంగా ఉంటాయి.

## పాలల్లో ఇది చిటికెడు కలిపి తాగారంటే..
# వానా కాలంలో ఏ రోగాలు దరిచేరవు!

వర్షా కాలంలో మన శరీరాన్ని ఇన్ఫెక్షన్ల నుంచి రక్షించుకోవడం ఓ పెద్ద సవాలు. ముఖ్యంగా ఈ కాలంలో మన శరీర రోగనిరోధక శక్తి చాలా తక్కువగా ఉంటుంది. అందుకే ఈ సమయంలో మనం మంచి ఆహారం తినాలని ఆరోగ్య నిపుణులు చెబుతుంటారు. కాబట్టి వానా కాలంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఏమి చేయాలి? మనల్ని మనం ఎలా రక్షించుకోవాలి? వర్షాకాలం వేసవి తాపం నుంచి ఉపశమనం కలిగించినా.. రుతుపవనాల ప్రారంభంతో వచ్చే ఆరోగ్య సమస్యలు పెద్ద సమస్యగా మారుతాయి. ఈ సమయంలో మన శరీరాన్ని ఇన్ఫెక్షన్ల నుంచి రక్షించుకోవడం ఓ సవాలు. ముఖ్యంగా ఈ కాలంలో మన శరీర రోగనిరోధక శక్తి చాలా తక్కువగా ఉంటుంది. అందుకే ఈ సమయంలో మనం మంచి ఆహారం తినాలని ఆరోగ్య నిపుణులు చెబుతుంటారు. కాబట్టి వానా కాలంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఏమి చేయాలి? మనల్ని మనం ఎలా రక్షించుకోవాలి? వంటి ప్రశ్నలకు పసుపు పాలు సమాధానం. అవును.. రోజూ పసుపు కలిపిన పాలు తాగడం వల్ల మనం ఊహించలేని ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. కొంతమందికి పసుపు కలిపిన పాలు తాగే అలవాటు ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది. శరీరానికి తక్షణ శక్తిని ఇస్తుంది. ముఖ్యంగా వర్షా కాలంలో పసుపు కలిపిన పాలు తాగడం ఆరోగ్యానికి చాలా మంచిది. పసుపులో అనేక ఔషధ గుణాలు ఉన్నాయి. ఇది వైరల్ ఇన్ఫెక్షన్ల నుంచి మనల్ని రక్షిస్తుంది. కాబట్టి వర్షంలో దీన్ని తాగడం వల్ల వైరల్ జ్వరం, జలుబు, దగ్గు నుంచి ఉపశమనం పొందవచ్చు. అంతేకాకుండా నిద్రలేమితో బాధపడేవారు పడుకునే ముందు ఒక గ్లాసుడు పసుపు కలిపిన పాలు తాగడం వల్ల త్వరగా నిద్రపోతారు. ఇది జీర్ణ సమస్యలను కూడా తొలగిస్తుంది. మలబద్ధకం సమస్యల నుండిచి ఉపశమనం కలిగిస్తుంది. జీర్ణక్రియ సజావుగా సాగడానికి సహాయపడుతుంది.



అంతేకాకుండా కడుపు నొప్పి వంటి సమస్యలను కూడా తగ్గిస్తుంది. చర్మ వ్యాధుల నుంచి కూడా రక్షిస్తుంది. పసుపు కలిపిన పాలు తీసుకోవడం ఊపిరితిత్తుల ఆరోగ్యానికి కూడా మంచిది. తలనొప్పి, శరీర నొప్పులు, ముక్కు దిబ్బడ వంటి సమస్యల నుంచి కూడా ఉపశమనం కలిగిస్తుంది. అదేవిధంగా ఈ పసుపు పాలు మహిళలు అనుభవించే పీరియడ్స్ నొప్పి నుంచి కూడా ఉపశమనం కలిగిస్తుంది. అదనంగా ఇది అధిక రక్తస్రావం సమస్య నుంచి ఉపశమనం పొందడంలో కూడా సహాయపడుతుంది. దీనితో పాటు శరీరం నుంచి చెడు బ్యాక్టీరియాను కూడా తొలగిస్తుంది.

## ఔషధాల గని..
### 40 రకాల వ్యాధులు మాయం



ఆయుర్వేదంలో వేల సంవత్సరాలుగా ఉపయోగించబడుతున్న అతి మధురం (లిక్కరైస్ లేదా ములేటి) కేవలం తియ్యటి రుచిని మాత్రమే కాదు, అద్భుతమైన ఔషధ గుణాలను కూడా కలిగి ఉంది. శ్వాసకోశ సమస్యల నుంచి జీర్ణక్రియ వరకు, రోగనిరోధక శక్తిని పెంచడం నుండి చర్మ సౌందర్యం వరకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందించే ఈ మూలిక గురించి ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం. అతి మధురం ఒక ప్రసిద్ధ ఆయుర్వేద మూలిక. దీని శాస్త్రీయ నామం గ్లయిసిరైజా గ్లాబ్రా దీన్నే ములేటి అని కూడా పిలుస్తారు. దీని వేర్లు, బెరడు అనేక ఔషధ గుణాలను కలిగి ఉంటాయి. తియ్యటి రుచిని కలిగి ఉండటం వల్ల దీనికి "అతి మధురం" అనే పేరు వచ్చింది. ఇందులో గ్లయిసిరైజిక్ ఆమ్లం, గ్లూకోజ్, సుక్రోజ్, ఈస్ట్రోజెన్ వంటి అనేక సమ్మేళనాలు ఉంటాయి. అతి మధురం దగ్గు, జలుబు, గొంతు నొప్పి, ఆస్తమా, బ్రోన్కైటిస్ వంటి శ్వాసకోశ సంబంధిత సమస్యలకు చక్కగా పనిచేస్తుంది. ఇది కఫాన్ని కరిగించి బయటకు పంపడంలో సహాయపడుతుంది, శ్వాసనాళాలను శుభ్రపరుస్తుంది. తేనెతో కలిపి తీసుకుంటే గొంతు నొప్పికి తక్షణ ఉపశమనం లభిస్తుంది.అతి మధురం జీర్ణవ్యవస్థకు ఎంతో మేలు చేస్తుంది. ఇది అల్సర్లు, కడుపులో మంట, ఎసిడిటీ, గ్యాస్, మలబద్ధకం వంటి సమస్యలను తగ్గిస్తుంది. దీనిలోని సమ్మేళనాలు కడుపులో ఒక రక్షణ పొరను ఏర్పరచి, ఆమ్లాల నుండి ఉపశమనాన్ని అందిస్తాయి. అలాగే, జీర్ణశక్తిని మెరుగుపరుస్తుంది. అతి మధురం రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్, యాంటీ మైక్రోబయల్ గుణాలు శరీరాన్ని వ్యాధుల నుండి కాపాడతాయి. కాలేయ ఆరోగ్యానికి అతి మధురం చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఇది కాలేయాన్ని ఫ్రీ రాడికల్స్ బారి నుండి రక్షించి, కామెర్లు వంటి కాలేయ సంబంధిత సమస్యల చికిత్సలో సహాయపడుతుంది. అతి మధురం చర్మ సౌందర్యానికి కూడా ఉపకరిస్తుంది. దీనిలోని యాంటీ ఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు చర్మాన్ని సంరక్షించి, దద్దుర్లు, దురదలు, మొటిమలు, మచ్చలు తగ్గించడంలో సహాయపడతాయి. ఇది చర్మం రంగును మెరుగుపరిచి, యవ్వనంగా కనిపించేలా చేస్తుంది. జుట్టు రాలడాన్ని తగ్గించి, జుట్టు ఆరోగ్యానికి కూడా మంచిది. అతి మధురం మానసిక ఒత్తిడి, ఆందోళన, నిరాశను తగ్గించి, మానసిక ప్రశాంతతను అందిస్తుంది. నీరసం, అలసటను తగ్గించి శరీరానికి శక్తిని, ఉత్సాహాన్ని ఇస్తుంది. కీళ్లు, కండరాల నొప్పుల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. అతి మధురం చూర్ణంతో దంతాలను తోముకోవడం వల్ల దంతాలు దృఢంగా మారి, పిప్పి పళ్ళు, చిగుళ్ళ రక్తస్రావం, నోటి పూత వంటి సమస్యలు తగ్గుతాయి. ఇది చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, గుండె ఆరోగ్యానికి సహాయపడుతుంది. ముఖ్యంగా స్త్రీలలో ఈస్ట్రోజెన్ హార్మోన్ల సమతుల్యతకు తోడ్పడుతుంది. జ్ఞాపకశక్తిని పెంచడానికి, ఏకాగ్రతను మెరుగుపరచడానికి సహాయపడుతుంది.

## హ్యాంగోవర్‌తో
# తలపట్టుకుని కూర్చోకండి



మద్యం ఆరోగ్యానికి మంచిది కాదు.. అది మితంగా తాగినా కూడా. ఇది అందరికీ తెలిసిన విషయమే. కొత్త పరిశోధనల ప్రకారం.. కొద్దిగా మద్యం తాగినా క్యాన్సర్ లాంటి పెద్ద జబ్బులు వచ్చే అవకాశం ఉంది. అయినా కూడా పండుగలు, వేడుకలప్పుడు కొంతమందికి మద్యం తాగడం మానలేని అలవాటు. మద్యం ఎక్కువగా తీసుకుంటే మరుసటి రోజు ఉదయం చాలా ఇబ్బందులు వస్తాయి. వీటినే హ్యాంగోవర్ అంటారు. ఇది మనసును, శరీరాన్ని అలసిపోయేలా చేస్తుంది. ఎక్కువ మద్యం తీసుకున్న వారికి ఇది మామూలే. కొన్నిసార్లు తక్కువగా తీసుకున్నా కూడా హ్యాంగోవర్ రావచ్చు. హ్యాంగోవర్ అంటే మద్యం పూర్తిగా శరీరంలో కలిసిన తర్వాత వచ్చే శారీరక, మానసిక పరిస్థితి. తల నొప్పి, అలసట, నీరసం కొద్దిగా వాంతులు, బాగా దాహం ఆకలి లేకపోవడం కళ్ళు ఎర్రబడడం, శబ్దం వెలుతురు పడకపోవడంమూర్ఛ రావడం, వణుకు, టెన్షన్ తో మనసు గుండె వేగంగా కొట్టుకోవడం, రక్తపోటు మారడం కొంతమందికి ఈ లక్షణాలు ఒకటి రెండు గంటల తర్వాత కనిపిస్తే.. మరికొందరికి ఒకటి రెండు రోజుల వరకు ఉంటాయి. ఇది వాళ్ల ఆరోగ్య పరిస్థితిని బట్టి ఉంటుంది. మద్యం వల్ల శరీరంలో నీరు తగ్గడం (డీహైడ్రేషన్), గ్లూకోజ్ స్థాయిలు తగ్గడం, ఎలక్ట్రోలైట్స్ లోపించడం లాంటివి జరుగుతాయి. తేలికపాటి, మసాలాలు లేని ఆహారం తినాలి.నీళ్లు ఎక్కువగా తాగాలి. పండ్ల రసాలు, ఎలక్ట్రోలైట్ డ్రింక్స్ తాగొచ్చు.మంచిగా నిద్రపోవాలి.గ్యాస్, తలనొప్పి లాంటి వాటికి డాక్టర్ సలహాతో మందులు వాడాలి.పరిస్థితి తీవ్రంగా ఉంటే డాక్టర్ సహాయం తీసుకోవడం మంచిది.హ్యాంగోవర్ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు. లిమిటెడ్ గా మాత్రమే మద్యం తీసుకోవాలి.ఒక్కసారిగా ఎక్కువగా తీసుకోకుండా.. కొద్ది కొద్దిగా మాత్రమే తీసుకోవాలి.మద్యం తాగే ముందు మంచిగా భోజనం చేయాలి.ప్రతి గ్లాసు మద్యం మధ్యలో నీళ్లు తాగడం వల్ల డీహైడ్రేషన్ తగ్గుతుంది.గ్యాస్ ఉంటే మద్యం తాగేటప్పుడు మరింత జాగ్రత్తగా ఉండాలి. హ్యాంగోవర్ అనేది తాత్కాలిక సమస్యే అయినా.. మద్యం తాగిన తర్వాత మన పనితీరు, డ్రైవింగ్ లాంటి వాటిలో ఇది ప్రమాదకరంగా మారొచ్చు. కాబట్టి మద్యం విషయంలో జాగ్రత్తగా ఉండాలి. అవసరం ఉన్నప్పుడు డాక్టర్ సలహా తీసుకోవడం చాలా ముఖ్యం.

## డయాబెటిస్ రోగులకు దివ్యౌషధం..



మెగ్నీషియం మానసిక ఒత్తిడిని తగ్గిస్తుంది. ఇందులో విటమిన్ బి6 కూడా ఉంటుంది. అరటి పూవ్వు మహిళల్లో రుతుక్రమ సమస్యలను నివారిస్తాయి. ఇందులో ఉండే ఐరన్ ఎర్ర రక్తకణాల ఉత్పత్తికి హెల్ప్ చేస్తుంది. అరటి పువ్వు తింటే రక్తంలోని చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయని అంటున్నారు..ఇందులో ఉండే తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్, ఫైబర్ రక్తంలో షుగర్ కంట్రోల్ చేయడానికి హెల్ప్ అవుతుంది. అరటిపువ్వుతో ఆరోగ్యానికి చాలా ప్రయోజనాలు ఉన్నాయని ఆయుర్వేద ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అరటి పువ్వులో పోషకాలు ఎక్కువగా ఉంటాయి. ఫైబర్, ప్రోటీన్స్, విటమిన్ ఎ, విటమిన్ సి, పొటాషియం, మెగ్నీషియం, కాల్షియం ఉంటాయి. ఎముకలను బలంగా ఉంచడంలో ఇవి సహాయపడతాయి. అరటి పువ్వులో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. అరటి పువ్వులో విటమిన్లు ఏ సీ పోషకాలు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. సీజనల్ జబ్బులు రాకుండా వ్యాధులను నివారిస్తాయి. దీనిలో ఉండే మెగ్నీషియం మానసిక ఒత్తిడిని తగ్గిస్తుంది. ముఖ్యంగా దీనిలో ఉండే విటమిన్ బి6.. మహిళల్లో రుతుక్రమ సమస్యలను నివారించి ఆరోగ్యాన్ని కాపాడుతుంది.అరటి పువ్వును ఆహారంలో భాగంగా చేసుకోవటం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇది శరీరంలో కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. దీర్ఘకాలిక వ్యాధులు కూడా తగ్గుతాయి. అరటి పువ్వులో మెగ్నీషియం చాలా సమృద్ధిగా ఉంటుంది. మెగ్నీషియం మానసిక ఒత్తిడిని తగ్గిస్తుంది. ఇందులో విటమిన్ బి6 కూడా ఉంటుంది. అరటి పూవ్వు మహిళల్లో రుతుక్రమ సమస్యలను నివారిస్తాయి. ఇందులో ఉండే ఐరన్ ఎర్ర రక్తకణాల ఉత్పత్తికి హెల్ప్ చేస్తుంది. అరటి పువ్వు తింటే రక్తంలోని చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయని అంటున్నారు..ఇందులో ఉండే తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్, ఫైబర్ రక్తంలో షుగర్ కంట్రోల్ చేయడానికి హెల్ప్ అవుతుంది. అరటి పువ్వులో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. నొప్పి, వాపులు, ఆర్థరైటిస్ వంటి సమస్యల్ని ఇవి తొలగిస్తాయి. అరటి పువ్వును తీసుకుంటే ఒత్తిడి తగ్గుతుంది. ఆందోళన, డిప్రెషన్ వంటి బాధలు కూడా ఉండవు. అరటి పువ్వు తీసుకుంటే పాలిచ్చే తల్లుల్లో పాల ఉత్పత్తి పెరుగుతుంది. బిడ్డ ఆరోగ్యంగా ఉంటుంది.

# నిధి అగర్వాల్ వింత అలవాటు..

## రాత్రిళ్లు అవి చూడాల్సిందేనట..!



సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే టాలీవుడ్ హీరోయిన్లలో నిధి అగర్వాల్ ఒకరు. సినిమాలకు సంబంధించిన అప్డేట్స్‌తో పాటు, తన గ్లామరస్ ఫోటోషూట్స్‌తో తరచూ నెట్టింట్లో హల్‌చల్ చేస్తూ ఉంటుంది. అంతేకాక, అభిమానులతో చిట్‌చాట్ చేసి ఇంట్రెస్టింగ్ విషయాలను షేర్ చేయడంలోనూ నిధి ముందుంటుంది. తాజాగా, ప్రతి రోజు రాత్రి తానే చేసే ఒక ఆసక్తికర విషయాన్ని అభిమానులతో పంచుకుంది. రాత్రి సమయంలో నాకు ఒక మర్డర్ మిస్టరీ సినిమా లేదా వెబ్ సిరీస్ చూడడం అలవాటుగా మారింది. కానీ ఇప్పుడు కొత్త కంటెంట్ దొరకడం లేదు. దయచేసి నాకు మంచి మర్డర్ మిస్టరీలు సజెస్ట్ చేయండి. ఏ భాష అయినా సరే! అని నిధి తన ట్వీట్ ద్వారా ఫ్యాన్స్‌ను కోరింది.నిధి ట్వీట్ కు నెటిజన్ల నుంచి ఆశించినంత రెస్పాన్స్ వచ్చిందనే చెప్పాలి. కానీ చాలా మంది కాస్త సెటైరిక్ మూడ్‌లోనే ఆమెకి రిప్లై ఇచ్చారు. రాధే శ్యామ్, బ్రహ్మోత్సవం,ఆచార్య , అజ్ఞాతవాసి సినిమాలు మర్డర్ మిస్టరీలే అంటూ కామెంట్ చేశారు. ఇక "హరి హర వీరమల్లు" సినిమా ఇప్పటివరకు విడుదల కాకపోవడం కూడా మర్డర్ మిస్టరీ అయిపోయిందని ఓ అభిమాని ఫన్నీగా స్పందించాడు. మరికొందరు "ఆదిపురుష్", "ఫ్యామిలీ స్టార్", "శక్తి", "స్పైడర్", "వరుడు", "భోళా శంకర్" వంటి సినిమాల పేర్లను మర్డర్ మిస్టరీలు అంటూ సజెస్ట్ చేశారు.ఇక మేఘాలయ హనీమూన్ కేసు, తేజేశ్వర్ మర్డర్ కేసులాంటివి అసలైన మర్డర్ మిస్టరీలని, వాటి గురించి తెలుసుకోమంటూ కొందరు సలహాల ఇచ్చారు. ఇస్మార్ట్ శంకర్ చిత్రంతో మంచి క్రేజ్ తెచ్చుకున్న నిధి అగర్వాల్ ప్రస్తుతం పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న హరి హర వీరమల్లు చిత్రంలో కథానాయికగా నటిస్తుంది. అలానే రెబల్ స్టార్ ప్రభాస్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న ది రాజా సాబ్ సినిమాల్లో కూడా హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ రెండు సినిమాలు పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలతో తెరకెక్కుతున్నాయి.హరి హర వీరమల్లు సినిమా జూలై 24, 2025న విడుదలకు సిద్ధమవుతుండగా, ది రాజా సాబ్ మూవీ డిసెంబర్ 5, 2025న థియేటర్లలోకి రానుంది. ఈ రెండు సినిమాల తర్వాత తన కెరీర్ మరో మలుపు తిరుగుతుందన్న ఆశాభావం నిధిలో కనిపిస్తోంది.

# నాకే టికెట్లు దొరకలేదు



మంచు వారి కలల సినిమా కన్నప్ప విడుదలకు కొన్ని గంటలే మిగిలి ఉంది. ఈ సందర్భంగా ముందు రోజు ప్రెస్ మీట్ పెట్టి మాట్లాడాడు మంచు విష్ణు. బుధవారమే ఈ సినిమాకు అడ్వాన్స్ బుకింగ్స్ ఓపెన్ చేశామని.. ఒక్క రోజు గడిచేలోపే 1.25 లక్షల టికెట్లు బుక్ అయినట్లు తనకు రిపోర్ట్ అందిందని.. ఇది తనకు కలలా అనిపిస్తోందని మంచు విష్ణు అన్నాడు. ఇది శివలీల అని విష్ణు పేర్కొన్నాడు. తన సినిమాకు ఇలాంటి స్పందన రావడం చాలా ఆనందంగా ఉందన్న విష్ణు.. తనకు కూడా కన్నప్ప టికెట్లు దొరకడం కష్టమైందని చెప్పుకొచ్చాడు. తాను ఇంకా కన్నప్ప ఫైనల్ కాపీ చూడలేదని.. శుక్రవారం ఉదయం తన తండ్రితో పాటు స్పెషల్ షో చూద్దామని ఒక థియేటర్లో టికెట్లు అడిగితే.. అన్నీ అయిపోయాయని.. టికెట్లు ఇవ్వడం కష్టమని చెప్పారని విష్ణు వెల్లడించాడు. దీంతో తమ కోసం మరో షో ఏర్పాటు చేసుకున్నట్లు విష్ణు తెలిపాడు. సినిమాకు ఇంత పెద్ద రిలీజ్ సాధ్యమైందంటే అది ప్రభాస్ వల్లే అని ఈ సందర్భంగా విష్ణు చెప్పాడు. ఇక కన్నప్ప నుంచి నుంచి రెండు రోజుల కిందట రిలీజ్ చేసిన వార్నింగ్ నోట్ గురించి విష్ణు స్పందించాడు. ఇది వార్నింగ్ కాదని.. తనకు వార్నింగ్ ఇచ్చేంత సీన్ లేదని అతను చెప్పాడు. కన్నప్ప సినిమా గురించి నెగెటివ్ క్యాంపైన్ చేయడానికి ఒక వర్గం కాచుకుని కూర్చుందని.. వాళ్లను ఉద్దేశించే ఇలా నోట్ రిలీజ్ చేశామని విష్ణు తెలిపాడు.

# బిచ్చగాడు-3 డైరెక్టర్ ఎవరంటే?



సౌత్ ఇండియాలో సెన్సేషన్ క్రియేట్ చేసిన చిత్రాల్లో 'బిచ్చగాడు' ఒకటి. ఈ సినిమా రిలీజవుతున్నపుడు పెద్దగా అంచనాలే లేవు. తమిళంలో అయినా పర్వాలేదు కానీ.. తెలుగు వాళ్లయితే రిలీజ్ రోజు ఈ చిత్రాన్ని అస్సలు పట్టించుకోలేదు. అసలు 'బిచ్చగాడు' అనే టైటిల్‌తో సినిమా ఏంటి అనుకున్నారు. కానీ రిలీజైన కొన్ని రోజులకు ఈ సినిమాకు అనూహ్యంగా స్పందన పెరిగిపోయింది. రివ్యూలు, మౌత్ పబ్లిసిటీ తోడై సినిమా ఊహించని స్థాయికి వెళ్లిపోయింది. మహేష్ బాబు సినిమా 'బ్రహ్మోత్సవం' మీద ఈ చిత్రం పైచేయి సాధించడం విశేషం. కొన్ని వారాల పాటు రన్ అయిన ఈ చిత్రం.. ఓటీటీలో కూడా అద్భుతమైన స్పందన తెచ్చుకుంది. ఈ మూవీతోనే సంగీత దర్శకుడు విజయ్ ఆంటోనీ హీరోగా స్టార్ ఇమేజ్ సంపాదించాడు. కానీ ఆ తర్వాత విజయ్ నుంచి చాలా సినిమాలు వచ్చాయి కానీ.. అవేవీ ఆశించిన ఫలితాన్ని అందుకోలేదు. చాలా ఏళ్ల తర్వాత అతడికి మళ్లీ సక్సెస్ అందింది 'బిచ్చగాడు-2'తోనే. ఆ సినిమాకు మిక్స్డ్ రివ్యూలే వచ్చినప్పటికీ 'బిచ్చగాడు' సీక్వెల్ కావడం వల్ల వసూళ్లు బాగానే వచ్చాయి. 'బిచ్చగాడు-2' తర్వాత విజయ్ ఆంటోనీ కెరీర్ మళ్లీ తిరోగమనంలోనే పయనిస్తోంది. ఇప్పుడు 'మార్గన్' అనే చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విజయ్ ఆంటోనీ.. 'బిచ్చగాడు-3' గురించి అనౌన్స్‌మెంట్ ఇచ్చాడు. త్వరలోనే చిత్రీకరణ మొదలుపెడతామని.. వచ్చే ఏడాది ఈ సినిమా రిలీజవుతుందని ప్రకటించాడు. 'బిచ్చగాడు'ను డైరెక్ట్ చేసింది 'శీను' ఫేమ్ శశి కాగా.. సీక్వెల్‌కు ఆయన పని చేయలేదు. విజయ్ ఆంటోనీనే దర్శకత్వ బాధ్యతలు చేపట్టాడు. ఇప్పుడు 'బిచ్చగాడు-3'ని కూడా విజయే డైరెక్ట్ చేయబోతున్నాడట. తన సొంత నిర్మాణ సంస్థ 'విజయ్ ఆంటోనీ ఫిలిమ్స్' బేనర్లోనే ఈ సినిమాను కూడా అతను ప్రొడ్యూస్ చేయబోతున్నాడు.

# షోలేకు నిజమైన గౌరవం ఇదే




బాలీవుడ్ లోనే కాదు ఇండియన్ సినిమాని గొప్ప మలుపు తిప్పిన ఎవర్ గ్రీన్ బ్లాక్ బస్టర్ గా షోలే స్థానం ఎప్పటికీ చెక్కుచెదరదు. 1975లో రిలీజైన ఈ మాస్టర్ పీస్ ఈ ఏడాది 50 సంవత్సరాలు పూర్తి చేసుకోబోతోంది. ఈ సందర్భంగా ఈ చిత్రాన్ని సరికొత్తగా రీ మాస్టరింగ్ చేసి ప్రదర్శనకు సిద్ధం చేస్తున్నారు. అందులో విశేషం ఏముంది, మన దగ్గర కూడా చాలా చేశారుగా అనుకోవచ్చు. కానీ షోలే వెనుక జరిగిన కసరత్తు, కష్టం వేరే ఉన్నాయి. అవేంటో చూద్దాం. 2022లో సిప్పి వారసుడు షెహజాద్ సిప్పి ఫిలిం హెరిటేజ్ ఫౌండేషన్ ని సంప్రదించాడు. షోలేని రీ స్టోర్ చేసి దానికి డిజిటల్ శాశ్వతత్వం ఇవ్వాలనేది అతని ఆలోచన.షోలేకు సంబందించిన ఒరిజినల్ 35 ఎంఎం కెమెరాతో పాటు సౌండ్ నెగటివ్స్ ముంబైలో ఉన్న ఒక పాత వేర్ హౌస్ లో దొరకబుచ్చుకున్నారు. అదనపు ఫుటేజ్ కు అవసరమైన రీల్స్ యుకెలో ఉన్న ఇరాన్ మౌంటెన్ లో దొరికాయి. దీనికి బ్రిటిష్ ఫిలిం ఇన్స్ ట్యూట్ సహకరించింది. ముంబై, లండన్ లో సేకరించిన నెగటివ్స్ ని భద్రంగా బెలోగ్నాలో ఉన్న లాఇమాజిన్ రిట్రోవటకు పంపించారు. సెన్సార్ సూచించిన క్లైమాక్స్ కాకుండా మరో ఎండింగ్ ఉన్న ఫుటేజ్ లండన్ లోనే దొరికింది. 70 ఎంఎం ప్రింట్స్ దొరికే అవకాశం లేకపోవడంతో షోలే కెమెరా విభాగంలో పని చేసిన కమలాకర్ రావు సహాయం తీసుకున్నారు. ఇలా మూడు సంవత్సరాల పాటు షోలే రీ స్టోరేషన్ అనేది ఒక యజ్ఞంలా జరిగింది. వందలాది రీళ్లను వడబోసి కలర్లు పాడవ్వకుండా ఒరిజినల్ ఫీల్ వచ్చేలా చేయడానికి ఫిలిం హెరిటేజ్ సభ్యులు ప్రాణం పెట్టేశారు. ఇప్పుడీ ప్రీమియర్ ఇటలీలో జరగనుంది. త్వరలోనే ఇండియాలో స్క్రీనింగ్ చేయబోతున్నారు. కొన్నేళ్ల క్రితం 3డికి మార్చి రీ రిలీజ్ చేశారు కానీ ఇప్పుడు డెవలప్ చేసిన ప్రింట్ అన్నింటికన్నా గొప్పగా ఉంటుందని తెలిసింది. అయిదు సంవత్సరాల పాటు నాన్ స్టాప్ గా థియేటర్లలో ఆడి ఇప్పటిదాకా పాతిక కోట్ల టికెట్లు అమ్మిన ఏకైక సినిమాగా చరిత్ర సృష్టించిన షోలేని మళ్ళీ బ్రతికించడం కన్నా నివాళి ఏముంటుంది.

# టికెట్ల రేట్లపై దిల్ రాజు కీలక వ్యాఖ్యలు



తెలుగు రాష్ట్రాల ప్రేక్షకుల సినిమా ప్రేమ గురించి కొత్తగా చెప్పాల్సిన పని లేదు. దాని గురించి ఇతర రాష్ట్రాల వాళ్లు కూడా గొప్పగా మాట్లాడుతుంటారు. దేశంలో మరెక్కడా లేనన్ని థియేటర్లు ఏపీ, తెలంగాణల్లో ఉన్నాయి. కానీ ఈ థియేటర్లలో ఆక్యుపెన్సీలు అంతకంతకూ పడిపోతుండడం గురించి ఇటీవల ఆందోళన వ్యక్తమవుతోంది. పేరున్న సినిమాలకు కూడా ఆక్యుపెన్సీలు ఆశించిన స్థాయిలో ఉండట్లేదు. ఓవైపు ఓటీటీల ప్రభావానికి తోడు.. టికెట్ల ధరలు ఎక్కువ ఉండడం, పెద్ద సినిమాలకు ఇంకా పెంచేస్తుండడం.. థియేటర్లలో క్యాంటీన్ల ధరలు కూడా ఎక్కువ ఉండడం ప్రతికూలంగా మారుతోందనే అభిప్రాయాలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అగ్ర నిర్మాత దిల్ రాజు ఈ అంశంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రేక్షకులను మళ్లీ థియేటర్లకు రప్పించే విషయమై ఇండస్ట్రీ గట్టిగా ఆలోచించాలని ఆయన అభిప్రాయపడ్డారు. తన వంతుగా తన ప్రొడక్షన్ నుంచి రానున్న 'తమ్ముడు' సినిమాకు దిద్దుబాటు చర్యలు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. ఈ మధ్య మిడ్ రేంజ్ సినిమాలకు కూడా తొలి వారం టికెట్ల ధరలు పెంచుకోవడానికి ప్రభుత్వాల నుంచి అనుమతులు పొందుతున్నారు నిర్మాతలు. 'కుబేర' సినిమాకు కూడా ఏపీలో రేట్లు పెంచుకున్నారు. తాను మాత్రం 'తమ్ముడు' సినిమాకు రేట్లు పెంచట్లేదని రాజు స్పష్టం చేశారు. తెలంగాణలో ఎలాగూ రేట్లు పెంచుకునే అవకాశం లేదు. ఏపీలో కూడా తాము ఆ ప్రయత్నం చేయలేదని రాజు చెప్పారు. ప్రభుత్వం నిర్దేశించిన నార్మల్ రేట్లతోనే సినిమా రిలీజవుతుందన్నారు. ఇక ఎగ్జిబిటర్లు అందరితోనూ మాట్లాడామని.. క్యాంటీన్ రేట్లను వీలైనంత తగ్గించాలని, ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని చెప్పానని రాజు తెలిపారు. టికెట్ల రేట్లు, క్యాంటీన్ ధరల విషయంలో అసంతృప్తితో ప్రేక్షకులు థియేటర్లకు తగినంత స్థాయిలో రావట్లేదన్నది వాస్తవమని రాజు అభిప్రాయపడ్డారు. ఆర్ఆర్ఆర్, కల్కి లాంటి భారీ చిత్రాల మీద పెట్టుబడి ఎక్కువ పెడతారు, మంచి విజువల్ ఎక్స్‌పీరియెన్స్ ఇస్తారు కాబట్టి రేట్లు పెంచుకోవడంలో తప్పు లేదని.. కానీ మామూలు సినిమాలకు కూడా రేట్లు పెంచితే థియేటర్లకు జనాలు ఎలా వస్తారని రాజు ప్రశ్నించారు. ఈ విషయంలో ఇండస్ట్రీ ఆలోచించి దిద్దుబాటు చర్యలు చేపట్టాల్సిన అవసరాన్ని రాజు గుర్తు చేశారు.

# నటనపై ఇష్టం బాధల్ని మరిపించింది



"తమ్ముడు'లో నా పాత్ర పేరు ఝాన్సీ కిరణ్మయి. నితిన్ అక్కగా కనిపిస్తా. దర్శకుడు శ్రీరామ్‌వేణు ఈ కథ చెప్పినప్పుడు, కరెక్ట్ కమ్‌బ్యాక్ మూవీ అనిపించింది' అని సీనియర్ నటి లయ అన్నారు. నితిన్ హీరోగా శ్రీరామ్‌వేణు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'తమ్ముడు'. దిల్‌రాజు నిర్మించిన ఈ చిత్రంలో లయ కీలక పాత్ర పోషించారు. జూలై 4న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో విలేకరులతో ముచ్చటించారు లయ.'ఈ సినిమాకోసం యూఎస్‌లో నా జాబ్ వదిలేశాను. అవకాశాలు కోరుకున్నప్పుడు రావు. అందుకే ఇండస్ట్రీ మళ్లీ నన్ను పిలిచినప్పుడు కాదనలేకపోయా. ఎంతో కష్టపడి ఈ పాత్ర చేశాను. మారేడుమిల్లి అడవుల్లో రాత్రివేళ చేసిన షూటింగ్ ఎక్స్‌పీరియన్స్‌ని జీవితంలో మరిచిపోలేను. కొన్ని సీన్స్‌లో చెప్పుల్లేకుండా నటించాను. చాలా దెబ్బలు తగిలాయి. యాక్టింగ్‌పై ఉన్న ఇష్టం ఆ బాధలన్నింటినీ మరిపించింది' అని లయ పేర్కొన్నారు. వివాహానంతరం భర్తతో కలిసి యూఎస్‌లో స్థిరపడిందామె.

సినీపరిశ్రమలో ఏదో ఒకటి సాధించాలనే తపనతోనే మళ్లీ తిరిగొచ్చానని, మంచి పాత్ర అనిపిస్తే మదర్‌గా చేయడానికైనా రెడీ అని, తాను యూఎస్ ఆర్టిస్ట్‌ని కానని, హైదరాబాద్ లోకల్ ఆర్టిస్టునేనని, ఇక్కడ కూడా తనకు ఇల్లు ఉందని, తనకోసం నిర్మాతలు ప్రత్యేకంగా సదుపాయాలను కూడా చూడాల్సిన పనిలేదని లయ పేర్కొన్నారు.

# కేజీ వీల్స్ రోడ్ల పై వస్తె 5 వేల జరిమానా...

## నిబంధనలు అతిక్రమిస్తే ట్రాక్టర్ యజమానులపై చర్యలు

## మంథని తహసీల్దార్ కుమారస్వామి



మంథని ( ప్రశ్న న్యూస్) మంథనిలో ట్రాక్టర్ లు కేజీ వీల్స్ రోడ్ల పైకి కేజీ వీల్స్ తో వస్తె చర్యలు తీసుకుంటామని మంథని తహసీల్దార్ కుమారస్వామి తెలిపారు. మొదటి సారి పట్టుబడితే 5 వేల జరిమానా, రెండవ సారి పట్టుబడితే 10 వేల జారీ విందించడం జరుగుతుంది. ఒక వేళ నిబంధనలు అతిక్రమిస్తే ట్రాక్టర్ యజమానులు చట్ట పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందనీ తెలిపారు.నియమ నిబంధనలు అతిక్రమిస్తే ట్రాక్టర్ యజమానులపై చర్యలు తీసుకుంటామని ట్రాక్టర్ యజమానులతో సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని తహసీల్దార్ తెలిపారు .

## ద్రౌపతి సమేత శ్రీ ధర్మరాజు స్వామి వారి

# వార్షిక తిరునాళ్లురు



శ్రీకాళహస్తి (ప్రశ్న న్యూస్) శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం అనుబంధ ఆలయమైన ద్రౌపతి సమేత ధర్మరాజు స్వామి వారి వార్షిక తిరునాళ్ల సందర్భంగా శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం నుంచి పాండవ ఉత్సవ మూర్తులను నగరోత్సవం నిర్వహించి పాండవ ఉత్సవమూర్తులను శ్రీ ద్రౌపదీ సమేత శ్రీ ధర్మరాజు స్వామి చేరుకున్నారు.ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం కార్యనిర్వహణాధికారి టి. బాపిరెడ్డి మరియు ఆలయ అధికారులు సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

## వివేకానంద విద్యా పరిషత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

## చిన్నారులకు అక్షరాభ్యాసం,అన్నప్రసాదం



గంగాధర,(ప్రశ్న న్యూస్) గంగాధర మండలం, మల్లాపూర్ గ్రామంలో శుక్రవారం సభను పురస్కరించుకొని వివేకానంద విద్యా పరిషత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. మల్లాపూర్,నడింపల్లి అంగన్వాడీ కేంద్రాల ప్రీ స్కూల్ పిల్లల కోసం సంతోషిమాత ఆలయంలో ఆలయ అర్చకులు హరికిషన్ ఆధ్వర్యంలో సామూహిక అక్షరాబ్యాసం, అనంతరం అన్నప్రసాదం కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గర్భిణీలు,బాలింతలకు వెయ్యి రోజుల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ నర్సింగరాణి, సూపర్వైజర్ రేణుక, స్పెషల్ ఆఫీసర్ శివ నాగేందర్ రెడ్డి, గ్రామపంచాయతీ కార్యదర్శి సాయికుమార్, అంగన్వాడీ టీచర్లు కవిత, రమణ, మాజీ సర్పంచ్ ఆకుల శంకరయ్య, ఆయా శైలజ, ఏఎన్ఎం శ్రీలత, ఆశా వర్కర్ శారద పాల్గొన్నారు. అలాగే ప్రీ స్కూల్ పిల్లల తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు, యువత, స్వామి వివేకానంద విద్యా పరిషత్ ట్రస్ట్ సభ్యులు తూడి కళ్యాణ్, భీమ సురేష్, భీమా హరీష్, వెంగల ప్రదీప్, కాసం హరీష్, కోల సతీష్, గంగాధర శ్రీనివాస్, గంగాధర మహేష్, వంగపెల్లి చక్రిధర్, కోల అజయ్, దూస రఘు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## బతుకు తెరువు కల్పించడం నేరమా.?



శ్రీకాళహస్తి (ప్రశ్న న్యూస్) రేణిగుంట ఝూర?ండ్ నుంచి పొట్ట చేత పట్టుకుని బతుకు తెరువు కోసం వచ్చిన వారికి బతుకు తెరువు కల్పించడం నేరమా అని కిరణ్ కుమార్,చందు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని గాజులమండ్యం పారిశ్రామిక వాడనందు%% మ్యాన్ పవర్ కాంట్రాక్ట్ నడుపుకుంటూ కొంతమంది జీవనోపాధి కల్పిస్తున్న కిరణ్ కుమార్ ఆయన సోదరుడు చందులపై తెలంగాణ పోలీసుల అనుచితంగా వ్యవహరించడం చాలా బాధాకరంగా ఉందన్నారు. గురువారం రేణిగుంట డిఎస్పి శ్రీనివాస్ కు వడమాల పేట మండలం కల్లూరు గ్రామంలోని దళితులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ జార?ండ్ చెందిన భార్య భర్తలను పనిలో పెట్టుకోవడం జరిగింది.

వారు తెలంగాణలో దొంగతనం కేసులో ముద్దాయిలని వారిని అప్పగించాలని కోరడంతో దాము వారు ఉన్నచోటిని పోలీసులకు చూపించారు.పోలీసులు వారిని తీసుకువెళ్లే మరల రెండవ రోజు వచ్చి దామును బలవంతంగా వారి వాహనంలో ఎక్కించుకుని అక్కడ ఇక్కడ తిప్పుతూ 24 గంటల తర్వాత బాగా కొట్టారన్నారు. తాను దళితుడిగా పుట్టడం నేరమా అని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ విషయం గాజులమండ్యం సీఐ మంజునాథరెడ్డి, ఎస్ఐ సుధాకర్లకు తెలుపగా స్పందించిన వారు రేణిగుంట డిఎస్పి శ్రీనివాస్ రావు కు విషయం తెలిపారు. డీఎస్పీ స్పందిస్తూ దామును ఎట్టి పరిస్థితుల్లో ఎక్కడికి పంపవద్దని కిరణ్ కుమార్ కు తెలిపినట్లు ఆయన పత్రికా సమావేశంలో తెలిపారు. ఎఫ్ఐఆర్ లో పేర్లు లేకుండా దళితుడినీ కదా ఎవరు అడిగే వారు లేరని తెలంగాణ పోలీసులు తీసుకెళ్లడం ఎంతవరకు న్యాయమంటూ ప్రశ్నించారు. తన సమస్యపై స్పందించిన డి.ఎస్.పి సీఐ, ఎస్ఐ లకు కృతజ్ఞతలు తెలియజేశారు. తనను, తన కుటుంబాన్ని మానసికంగా హింసించిన తెలంగాణ పోలీసులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

# జులై 9 సార్వత్రిక సమ్మెకు నోటీసులు!

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజాసంఘాల హెచ్చరిక..!!

**- ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి**

**- కడారి రాములు**





వేములవాడ, (ప్రశ్న న్యూస్) జూలై 9న నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెకు సంబంధించి, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని కలెక్టర్,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రజిత,జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి,సహాయ కార్మికశాఖ అధికారి,పౌర సరఫరాల అధికారి,జిల్లా విద్యాధికారులకు శుక్రవారం ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి కడారి రాములు ప్రజాసంఘాల నేతలతో కలిసి నోటీసులు అందజేశారు.ఈ సందర్భంగా కడారి రాములు మాట్లాడుతూ, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాల నుండి 29 చట్టాలను తొలగించి, వాటిని నాలుగు కోడ్లుగా మారుస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. కొత్తగా తేవాలనుకునే చట్టాలు కార్మికులకు వ్యతిరేకంగా,కార్పోరేట్ శక్తులకు అనుకూలంగా ఉంటాయన్నారు. ప్రత్యేకంగా 8 గంటల పని పద్ధతి, సమ్మె హక్కు, కనీస వేతన హక్కులను కాలరాస్తున్నదన్నారు. భవన నిర్మాణ రంగంలో లేబర్ కార్డు వ్యవస్థను ప్రైవేటు రంగానికి అప్పగించే కుట్ర, సహజ సంపదలను కార్పోరేట్ సంస్థలకు ధారాదత్తం చేసే విధానం, కాంట్రాక్టు, ఔత్సోర్సింగ్ ఉద్యోగుల దోపిడీపై నేతలు తీవ్రంగా స్పందించారు.

**అవసరాలు - డిమాండ్లు**

ప్రభుత్వ రంగంలో పనిచేసే కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్, క్యాజువల్, టెంపరరీ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

**కనీస వేతన చట్టాన్ని ఖచ్చితంగా అమలు చేయాలి**

అంగన్వాడీ, 2వ ఏ.ఎన్. ఎం.,ఎన్.హెచ్.ఎం.కాంట్రాక్టు ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

**- 'సమాన పనికి సమాన వేతనం' అనే రాజ్యాంగ సూత్రాన్ని అమలు చేయాలి**

జులై 9న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని నేతలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, ప్రధాన కార్యదర్శి కడారి రాములు, సీఐటీయూ నేత ఎగమంటి ఎల్లారెడ్డి,టియుసిఐ నాయకుడు జిందం ప్రసాద్ పాల్గొన్నారు.

## ప్రజల శ్రేయస్కరంగా

# ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలు

- **ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే: ఆది శ్రీనివాస్**
- **ముఖ్యమంత్రి సహాయనిధి, కళ్యాణ లక్ష్మీ చెక్కులు లబ్ధిదారులకు పంపిణీ**
- **వేములవాడలో 76 మంది లబ్ధిదారులకు ఆర్థిక భరోసా**
- **ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా పంపిణీ**



వేములవాడ,(ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి సహాయ నిధి, కళ్యాణ లక్ష్మీ,షాదీ ముబారక్ పథకాల కింద లబ్ధిదారులకు వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ 76 మంది అర్హులైన మహిళలకు కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాల ద్వారా చెక్కులు పంపిణీ చేయగా, మరోవైపు వైద్య అవసరాల కోసం అర్హత పొందిన 54 మందికి మొత్తం రూ.18,80,000 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా విప్ ఆది మాట్లాడుతూ "పేద ప్రజలకు ప్రభుత్వ పథకాలు శ్రేయస్కరంగా మారుతున్నాయి.



ఒక్కో కుటుంబానికి చిన్న సహాయమైనా ఎంతవిధంగా ఉపశమనం కలిగిస్తుందో మేము నిత్యం చూస్తున్నాం. ప్రతీ అర్హతగల వ్యక్తికి న్యాయం జరిగేలా అధికార యంత్రాంగం నిష్పక్షపాతంగా పనిచేయాలి," అని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వ పథకాల పట్ల కృతజ్ఞతలు వ్యక్తం చేశారు.

## విద్యుత్ శాఖ అధికారులకు కాసులు కురిపిస్తున్న రాజీవ్ నగర్



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) శ్రీకాళహస్తి పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీ విద్యుత్ శాఖ అధికారులకు కాసులు కురిపిస్తుంది. రాజీవ్ నగర్ కాలనీ లైన్ ఇన్స్పెక్టర్, లైన్మెన్ లు విద్యుత్ శాఖ ఎస్టిమేషన్ లేకుండానే విద్యుత్ స్తంభాలు, లైన్లను ఏర్పాటు చేస్తూ కన్స్యూమర్స్ దగ్గర లక్షలు గడిస్తున్నారు. గత కొంతకాలంగా విద్యుత్ శాఖ అధికారులు సర్వీసులు మంజూరు చేస్తున్నారు. అందులో భాగంగా పోల్స్ సర్వీస్ లైన్ అందుబాటులో లేకపోవడంతో లైన్ ఇన్స్పెక్టర్ లైన్ మాన్ లకు అవకాశం దొరికింది. దీంతో ఒక్కొక్క సర్వీస్ ఫోన్, లైన్ లాగాలన్న ఒక్కసారి సర్వీస్కు 30 నుంచి 40 వేల వరకు ముట్ట చెప్పాల్సి వస్తుందాని లబ్ధిదారులు వాపోతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ స్తంభాలు సర్వీస్ లైన్ లాగాలన్న ఉన్నతాధికారుల పర్మిషన్ ఎస్టిమేషన్ తీసుకోవాలి. మామూలు మత్తులో కొంతమంది అధికారులు ఎస్టిమేషన్ లేకుండానే విద్యుత్ స్తంభాలు సర్వీస్ రెయిన్ లాగుతున్నారు. దీనిపై విద్యుత్ శాఖ అధికారి (ఏఈ) శివప్రసాద్ ను వివరణ కోరగా నేను వచ్చే ఆరు నెలలు అవుతుంది నా పర్మిషన్ లేకుండా ఎక్కడ ఏమి జరగలేదని ఆయన చెబుతున్నారు. గత 15 నుంచి 20 రోజుల లోపల విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి సర్వీస్ లైన్ లాగా రెడ్డి ఇదేమిటని మీడియా ప్రతిరోజు అడగ్గా మీరు వచ్చి ఏరియా ఎక్కడో చూపిస్తే మేము తగు చర్యలు తీసుకుంటామని చెప్పడం. విద్యుత్ శాఖ అధికారికి అందులో ఏఈ స్థాయి అధికారికి మేము చూపిస్తే ఆయన చర్యలు తీసుకోవడం అనడం చాలా విడ్డూరంగా ఉంది. అంటే ఆ అధికారి ఏ విధంగా విధులు నిర్వహిస్తున్నారు ఉన్నతాధికారులకే తెలియాలి. దీనిపై విచారణ జరిపి మామూలు మత్తులో తూగుతున్న విద్యుత్ శాఖ సిబ్బందిపై తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## అనధికారికంగా పోలీస్, ప్రెస్ స్టిక్కర్లు కలిగిన వాహనాలపై కేసులు నమోదు



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) శ్రీకాళహస్తిలో పోలీస్, ప్రెస్ స్టిక్కర్లను వాహనాలపై వేసుకుంటే చర్యలు తప్పవని శ్రీకాళహస్తి ట్రాఫిక్ ఎస్ఐ సిహెచ్ గోవింద్ అన్నారు.ఒకటవ పట్టణ సీఐ గోపి ఆదేశాల మేరకు పట్టణంలోని పలుచోట్ల పోలీస్, ప్రెస్, షిక్కర్లు కలిగిన వాహనాలపై కేసులు నమోదు చేసి వారి చేత స్టిక్కర్లను తొలగి%శీ%చారు. అనంతరం ద్విచక్ర వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. పోలీస్, ప్రెస్ విధులకు సంబంధం లేని వారు ఇలా స్టిక్కర్లు వేసుకుంటే చట్ట ప్రకారం వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ గోవింద్ పోలీస్ సిబ్బందులు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేసిన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్

**మంత్రివర్యులు దనసరి సీతక్క గారి ఆదేశాల మేరకు**



ములుగు (ప్రశ్న న్యూస్) గోవిందరావుపేట మండల చల్వాయి, గోవిందరావుపేట, పసర, లక్నవరం గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతూ శస్త్ర చికిత్స తీసుకున్న వారికి మందుల ఖర్చుల నిమిత్తం వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి చెక్కులు రాగా గోవిందరావుపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాలడుగు వెంకటకృష్ణ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు.ఈ కార్యక్రమంలో గోవిందరావుపేట మండల రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ కాంగ్రెస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, యూత్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు అభిమానులు అందరూ పాల్గొన్నారు.

## స్కూల్ ప్రాంతంలో ప్రమాద నివారణకు వారాల ముందస్తు చర్యలు అభినందనీయం

**-రోడ్డు మరమ్మత్తు చేపట్టిన కాంగ్రెస్ పార్టీ**

**సీనియర్ నాయకులు : వారాల నర్సింగం**



బోయినిపల్లి /కరీంనగర్, (ప్రశ్న న్యూస్)కరీంనగర్ జిల్లా కేంద్రంలోని విద్యానగర్ ప్రాంతంలోని బీరప్ప కమాన్ సమీపంలో, సిద్దార్థ స్కూల్ పరిసర ప్రాంతాల్లో రోడ్డు పూర్తిగా దెబ్బతినిపోవడంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతుండగా, కొందరికి గాయాలపాలయ్యారు. ఈ ప్రాంతం నిత్యం స్కూల్ పిల్లలు, వాకర్స్, బైక్ వాహనదారులతో కిటకిటలాడే ప్రాంతం కావడంతో ప్రమాదభయం నెలకొన్నది.ఈ సమస్యను గమనించిన స్థానికులు వెంటనే జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు వారాల నర్సింగంకు సమాచారం అందించగా,తక్షణమే సంప్రదించారు. ప్రజల విజ్ఞప్తిని సానుకూలంగా తీసుకున్న నర్సింగం అక్కడికి స్వయంగా వెళ్లి పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. "ఇది స్కూల్ పిల్లలు రాకపోకల ప్రాంతం కావడంతో ఎవరూ ప్రమాదానికి గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి" అనే ఆవశ్యకతను గుర్తించి, తక్షణమే సంబంధిత అధికారులతో సంప్రదించి యుద్ధప్రాతిపదికన రోడ్డు మరమ్మత్తు పనులను చేపట్టారు.ప్రమాదం జరిగేలోపు స్పందించి, రహదారి మరమ్మత్తు చేపట్టిన వారాల నర్సింగం కు స్థానికులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా పలువురు స్థానికులు మాట్లాడుతూ, "ఇలాంటి సమస్యలపై ప్రజా ప్రతినిధులు చురుగ్గా స్పందిస్తే, అనేక అపాయం నుండి ప్రజలు తప్పించుకోగలరన్నారు.

# అందుబాటులో లేని మంథని అబ్కారీ శాఖ

## విచ్చల విడిగా పెరిగిపోతున్న బెల్ట్ షాపులు

- ఏ సమయంలోనైనా అందుబాటులో మద్యం - చోద్యం చూస్తున్న ఉన్నత అధికారులు
- బానిసలుగా మారి జీవితాలను,కుటుంబాలను నాశనం చేసుకుంటున్నా మందు బాబులు

**మంథని ( ప్రశ్న న్యూస్)** రాష్ట్రవ్యాప్తంగా మద్యం ఏరులై పారుతుంది ఇక గ్రామాలలో బెల్ట్ షాపులు విచ్చలవిడిగా రెచ్చిపోతున్నాయి. ఎక్సైజ్ శాఖ అధికారులకు ప్రతినెల మామూలు ఇస్తూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అక్రమ బెల్ట్ షాపుల దందా మూడు పువ్వులు ఆరు కాయలు అన్నట్లు హ్యాపీగా జరుగుతోంది. కొంతమంది రాజకీయ నాయకులు ప్రజాప్రతినిధులు అండగా ఉంటూ వారి కని సైగల్లోనే ఇది జరగడం సర్వసాధారణంగా మారింది. ఇక పెద్దపల్లి జిల్లా మంథని ప్రాంతంలో అబ్కారీ శాఖ అధికారులు అందుబాటులో లేకపోవడంతో అదే అవకాశం గా భావిస్తున్న కొంతమంది వ్యక్తులు యదేచ్ఛగా బెల్ట్ షాపులను ప్రారంభిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కరువవడం తో కిరాణా దుకాణాల మాదిరి బెల్ట్ షాపులు ఎక్కడపడితే అక్కడ నిర్వహిస్తున్నారు.దీంతో మందుబాబులకు రాత్రింబవళ్లు తేడా లేకుండా జనావాసాల మధ్యలో మద్యం 24 గంటలు అందుబాటులో ఉండడంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఏ సమయంలో పడితే ఆ సమయంలో మందుబాబులు వస్తుండడంతో మహిళలు కనీసం బయట పనులు నిర్వహించుకోలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి.బెల్ట్ షాపులను నిర్వహించాలంటే ఆప్కారి శాఖ అనుమతితో నిర్ణిత సమయంలో నిర్వహించుకునే వెసులుబాటు ఉన్నప్పటికీ వాటిని పక్కనపెట్టి ఇష్టానుసారంగా బెల్ట్ షాపు యజమానులు మద్యాన్ని ఏరులై పారిస్తున్నారు. పిలిస్తే పలుకుతా అనే రీతిలో బెల్ట్ షాపులు అందుబాటులో ఉండడంతో ఎప్పుడు పడితే అప్పుడు మందుబాబులు మద్యం సేవిస్తూ, శాంతి భద్రతలకు విఘాతం



కలిగిస్తున్నారు. రాష్ట్ర మంత్రి ప్రాతినిధ్యం వహించే సాక్షాత్తు మంథని లో మహనీయుల విగ్రహాల ముందే యదేచ్ఛగా మద్యం దుకాణాలతో పోటీ పడుతూ బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు అంటే అధికారుల పర్యవేక్షణ ఎంతవరకు ఉందో అర్థం చేసుకోవచ్చు. ఎవరికి అందాల్సినంత వారికి అందుతుండడంతో అధికారులు అంతంత మాత్రంగానే వ్యవహరిస్తున్నట్టు జోరుగా చర్చ జరుగుతోంది.గ్రామాలలో ఉండే గుడుంబా స్థావరాలపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పే అధికారు లు ఇష్టాను రీతిలో వైన్ షాపుల మాదిరి బెల్ట్ షాపులు నిర్వహించే వ్యక్తులపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఏ సమయంలోనైనా బెల్ట్ షాప్ ల ద్వారా మద్యం అందుబాటులో ఉండడం దీనికి తోడు డబ్బులు లేకున్నా ఉద్దేర



గా సైతం మద్యం దొరుకుతుండడంతో యువత బానిసలుగా మారి జీవితాలను చిన్నాభిన్నం చేసుకుంటూ, తిరిగి డబ్బులు కట్టలేని పరిస్థితుల్లో బైక్ ఇంట్లో వస్తువులు సైతం కుద పెడుతున్నారు. లేదా దొంగతనాలకు పాల్పడుతూ కుటుంబ వ్యవస్థను నాశనం చేసుకుంటున్నారు. విధుల పట్ల బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు కనీసం కార్యాలయం అందుబాటులో లేనప్పటికీ అధికారులైన అందుబాటులో ఉండాలని, పుట్టగొడుగుల్లా విస్తరించిన బెల్టు షాపులపై ఇప్పటికైనా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# విషయం లేనందువల్లే రేవంత్ రెడ్డి బూతులు మాట్లాడుతున్నారు

- బనకచర్లపై కేంద్రాన్ని నిలదీయాలని డిమాండ్

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** బనకచర్ల ప్రాజెక్ట్ అంశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ (పీపీటీ) పేరుతో సీఎం కేవలం కాలయాపన చేస్తూ ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ పీపీటీ కేవలం కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల కోసమే ఇచ్చారని, ఇది ఓ నాటకమని మండిపడ్డారు. 2016 నాటి అజెండా మినిట్స్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని హరీశ్ రావు సవాల్ విసిరారు. ఆనాటి సమావేశంలో మాజీ సీఎం కేసీఆర్ కేవలం




ఇరు రాష్ట్రాలు కూర్చుని ప్రణాళికలు సిద్ధం చేసుకుందామని మాత్రమే అన్నారని గుర్తుచేశారు. తెలంగాణ ప్రయోజనాలకు విఘాతం కలిగించే ఏ ప్రతిపాదననూ ఒప్పుకునేది లేదని కేసీఆర్ ఆనాడే స్పష్టం చేశారని వివరించారు. ఈ నేపథ్యంలో, బనకచర్ల విషయంపై జరగబోయే కేంద్ర జలశక్తి సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం తన వాదనలను బలంగా వినిపించాలని ఆయన డిమాండ్ చేశారు. విషయం లేనందువల్లే సీఎం రేవంత్ రెడ్డి బూతులు మాట్లాడుతున్నారని హరీశ్ రావు విమర్శించారు. "బేసిన్‌కు, బాసిన్‌కు తేడా తెలియని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి" అంటూ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ఒత్తిడి వల్లే ప్రభుత్వం ఎంపీలతో సమావేశం ఏర్పాటు చేసిందని అన్నారు. తమ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు బనకచర్ల కార్పొరేషన్ ఏర్పాటు కాలేదని, టెండర్లు కూడా పిలవలేదని ఆయన స్పష్టం చేశారు. ఈ వివాదంలో బీజేపీ తీరును కూడా హరీశ్ తప్పుబట్టారు. "చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా" బీజేపీ నేతల వైఖరి ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు నష్టం జరగకముందే కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ జోక్యం చేసుకుని బనకచర్ల ప్రాజెక్టును ఆపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం సరైన రీతిలో స్పందించకపోతే, బనకచర్ల ప్రాజెక్టు వల్ల నష్టపోయే రైతులతో కలిసి సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు.

# అక్రమ నిర్మాణాల వద్ద వసూళ్లకు పాల్పడుతున్న డిప్యూటీ మేయర్ పిఏ

- అభివృద్ధిని మరచి వసూళ్లు ప్రారంభించిన డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి అంటూ ఆరోపణలు
- మామూళ్లు ఇవ్వకుంటే కూల్చివేస్తామంటూ హెచ్చరిస్తున్నారంటూ కార్పొరేటర్ ఆవేదన
- సికింద్రాబాద్ నియోజకవర్గంలో అక్రమ వసూళ్లపై కార్పొరేటర్ల అంతర్గత యుద్ధం
- అక్రమ నిర్మాణాలే లక్ష్యంగా ధనార్జనకు పాల్పడుతున్న సికింద్రాబాద్ నియోజకవర్గ కార్పొరేటర్లు

**తార్నాక (ప్రశ్న న్యూస్)** గ్రేటర్ హైదరాబాద్ డిప్యూటీ మేయర్ పిఏ తుల్జారాం అక్రమ నిర్మాణాల దగ్గర వసుళ్లకు పాల్పడుతున్నారని మెట్టుగూడ కార్పొరేటర్ సునీత ఆరోపించారు. ఈ సందర్భంగా ఆమె సోషల్ మీడియాలో ఒక వీడియోని వైరల్ చేస్తూ గ్రేటర్ హైదరాబాద్ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి పిఏ తుల్జారాం అక్రమ నిర్మాణాల వద్ద వసూళ్లకు పాల్పడుతున్నారని మెట్టుగూడ డివిజన్ పరిధిలో ఒకవేళ మామూళ్లు ఇయ్యని పక్షంలో కూల్చివేతలు చేయిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై డిప్యూటీ మేయర్ భర్త శోభన్ రెడ్డి తో ఫోన్లో సంభాషించడం జరిగిందని తను కూడా వసూళ్లకు మద్దతు పలికినట్లు ఆమె ఆరోపించారు. తన మెట్టుగూడ డివిజన్లో అక్రమ నిర్మాణాల వద్ద వసూలు చేస్తున్నారని ఇలా నగరవ్యాప్తంగా అక్రమ నిర్మాణాల వద్ద వసూళ్లు చేయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. డిప్యూటీ మేయర్ ప్రజల సమస్యలను అభివృద్ధిని మరిచి అక్రమ నిర్మాణాల వద్ద వసూలు చేయడం ఎంతవరకు సమంజసమని ఆమె ప్రశ్నించారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో డిప్యూటీ మేయర్ స్థానంలో ఉండే అభివృద్ధిని చేయించడం మరిచి వసూలు చేయించడం ఏమిటని ప్రజా సమస్యలను పట్టించుకోకుండా కేవలం ధనాజనే లక్ష్యంగా డిప్యూటీ మేయర్ వ్యవహరించడం బాధాకరంగా ఉందన్నారు. అయితే సికింద్రాబాద్ నియోజకవర్గంలో భారీగా జరుగుతున్న అక్రమ నిర్మాణాల వద్ద



వసూళ్లకు పాల్పడుతున్న కార్పొరేటర్లకు ఇప్పుడు డిప్యూటీ మేయర్ రాకతో అసూయ ఏర్పడి తమ అక్రమ సంపాదన తగ్గిపోతుందన్న బాధతో ఇలా మీడియాకు ఎక్కి అక్రమ నిర్మాణాల వద్ద కార్పొరేటర్లు దండుకుంటున్నారన్న సమాచారం



బహిరంగంగా తెలిపినట్లు మారింది పరిస్థితి. ఏది ఏమైనా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అక్రమ నిర్మాణాల వద్ద కార్పొరేటర్లు భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారన్న విషయం అందరికీ తెలిసిందే దానికి బలం చేకూరుస్తూ కార్పొరేటర్లు ఇలా వీడియోలు రిలీజ్ చేయడం పై కార్పొరేటర్లు అంటేనే "ఛీ" అనే పరిస్థితి నెలకొన్నది గ్రేటర్ హైదరాబాద్ లో.

# మంజీరా డ్యామ్‌కు పగుళ్లు వచ్చాయన్న వార్తలు అవాస్తవం

- బ్యారేజీని పరిశీలించిన ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** మంజీరా డ్యామ్‌కు పగుళ్లు వచ్చాయంటూ కొద్ది రోజులుగా జరుగుతోన్న ప్రచారంలో ఎటువంటి వాస్తవం లేదని తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జా స్పష్టం చేశారు. ఈ వార్తలు పూర్తిగా నిరాధారమైనవని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన హామీ ఇచ్చారు. ఈ వదంతుల నేపథ్యంలో రాహుల్ బొజ్జా శుక్రవారం నేరుగా మంజీరా బ్యారేజీని సందర్శించి క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షించారు. డ్యామ్ నిర్మాణాన్ని, దాని పటిష్టతను అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, డ్యామ్ భద్రతపై నిపుణులతో కూడిన సేఫ్టీ కమిటీ ఇచ్చిన నివేదికలో ఎక్కడా పగుళ్ల ప్రస్తావన లేదని తేల్చి చెప్పారు. ప్రతి ఏటా వర్షాకాలానికి ముందు డ్యామ్‌కు చిన్నపాటి మరమ్మతులు చేపట్టడం సాధారణ ప్రక్రియ అని రాహుల్ బొజ్జా వివరించారు. ప్రస్తుతం జరుగుతున్నవి కూడా అలాంటి సాధారణ మరమ్మతులే తప్ప, డ్యామ్‌కు ఎటువంటి ప్రమాదం వాటిల్లలేదని ఆయన పేర్కొన్నారు.

# హత్య కేసు కొట్టేసిన జిల్లా కోర్టు

## - నిందితుని తరపున యువ న్యాయవాది పూస మానస వాదనలు

ఖమ్మం (ప్రశ్న న్యూస్) ఖమ్మం నగరంలో 2023లో సంచలనంగా మారిన హత్యకేసులో ఖమ్మం ఫ్యామిలీ కోర్టు తన తీర్పు వెలువరించింది ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న మొక్క కోటయ్య పై నేరం రుజువు కానందున కోర్టు అతనిని నిర్దోషిగా తీర్పు చెప్పింది. వివరాల్లోకి వెళితే ఖమ్మం రూరల్ మండలం ఆరెకోడుకు చెందిన రేణుకకు, నేలకొండపల్లి మండలం మొక్క కోటయ్యతో వివాహం జరిగింది. వీరిరువురూ ఖమ్మం నగరం మామిళ్లగూడెంలో నివాసం ఉంటున్నారు. రేణుకకు తల్లి నుంచి పసుపు కుంకుమల కింద కొంత ఆస్థి సంక్రమించింది. ఈ ఆస్థికి సంబంధించి కొంత వివాదం ఉందని, దాని కారణంగానే తన అక్కను మొక్క కోటయ్య ఉరివేసి చంపాడని ఆరోపిస్తూ రేణుక తమ్ముడు సిలివేరు అబ్బులయ్య టూ టౌన్లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణ సందర్భంగా కోర్టు పలువురు సాక్షులను విచారించింది. ప్రాసిక్యూషన్ కేసును రుజువు చేయకపోవడంతో, నిందితుడు నిర్దోషి అని ఫ్యామిలీ కోర్టు న్యాయాధికారి తీర్పు చెప్పారు. నిందితుని తరపు



న్యాయవాదిగా పూన మానన వ్యవహరించారు. చిన్న వయసులో హత్య కేసును వాదించి తన ప్రతిభ కనబరిచినందుకు పలువురు సీనియర్ న్యాయవాదులు పూస మానసను అభినందించారు.



# గగనతలం మూసివేతను పొడిగించిన ఇరాన్

- శనివారం మధ్యాహ్నం వరకు విమానాల రాకపోకలు నిలిపివేత




**టెహ్రాన్ (ప్రశ్న న్యూస్)** ఇజ్రాయెల్‌తో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ కీలక నిర్ణయం తీసుకుంది. తమ దేశ గగనతలాన్ని పూర్తిస్థాయిలో పునఃప్రారంభించే నిర్ణయాన్ని శనివారం మధ్యాహ్నానికి వాయిదా వేసింది. దేశంలోని ఉత్తర, పశ్చిమ, దక్షిణ ప్రాంతాల గగనతలంపై ఆంక్షలు కొనసాగుతాయని స్పష్టం చేసింది. ఈ మేరకు ఇరాన్ అధికారిక వార్తా సంస్థ ఐఆర్ఎన్ఏ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. విమాన ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఇరాన్ రోడ్లు, పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రతినిధి మజిద్ అఖవాన్ తెలిపారు. ఇప్పటికే దేశ తూర్పు గగనతలాన్ని దేశీయ, అంతర్జాతీయ విమాన సర్వీసుల కోసం తెరిచామని, మిగిలిన గగనతలాన్ని శనివారం వరకు మూసివేస్తున్నామని ఆయన వెల్లడించారు. దశలవారీగా విమాన గగనతలాన్ని ఘర్షణలకు ముందున్న స్థాయికి తీసుకురావడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.జూన్ 13న ఇజ్రాయెల్ దళాలు టెహ్రాన్ సహా ఇతర ప్రాంతాలపై వైమానిక దాడులు జరపడంతో ఇరాన్ తమ గగనతలాన్ని పూర్తిగా మూసివేసింది.ం

ఇరు దేశాల మధ్య 12 రోజుల పాటు తీవ్ర వైమానిక ఘర్షణలు కొనసాగాయి. అనంతరం మంగళవారం ఇరు పక్షాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. మరోవైపు, ఇరాన్‌పై జరిపిన 12 రోజుల సైనిక చర్యలో ఆ దేశ అణు కార్యక్రమానికి భారీ నష్టం కలిగించామని ఇజ్రాయెల్ రక్షణ దళాలు (ఐడీఎఫ్) ప్రకటించాయి. అయితే ఈ యుద్ధంలో ఇజ్రాయెల్, అమెరికాపై తామే గెలిచామని ఇరాన్ సుప్రీంనేత ఆయతుల్లా ఖమేనీ ప్రకటించుకోవడం గమనార్హం.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588